ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 43.0
కనిష్ఠం : 26.0

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ఏలూరు అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం తెలుగు/సంస్కృతం/హిందీ/ఉర్దూ పరీక్షలకు జనరల్, ఒకేషనల్ విభాగాల్లో మొత్తం 1970 మంది దరఖాస్తు చేసుకోగా 1805మంది హాజరయ్యారని డీవీఈవో యోహాన్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 383 మందికి 333 మంది హాజరయ్యారని వివరించారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు నమోదు కాలేదన్నారు.

'పది' సప్లిమెంటరీ పరీక్షలపై సమీక్ష

పదో తరగతి రెగ్యులర్, దూరవిద్య (అపోస్) సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 19 నుంచి 28 వరకు జరగనున్న నేపథ్యంలో మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై సోమవారం వివిధ శాఖల జిల్లా అధికారులతో జరిగిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ 40 కేంద్రాల్లో జరిగే రెగ్యులర్ విభాగం పరీక్షలకు 7,707 మంది విద్యార్థులు, 11 కేంద్రాల్లో జరిగే ఓపెన్ స్కూల్స్ టెన్త్ పరీక్షలకు 1,004 మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. వేసవి తీవ్రత దృష్ట్యా పరీక్ష కేంద్రాల్లో ముందస్తు ఏర్పాట్లు, ప్రథమ చికిత్స కేంద్రాలు, మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ, డీఆర్వో విశ్వేశ్వరరావు, డీటీసీ కరీం, ఆర్టీసీ డీఎం వాణి, తపాలా, విద్యుత్, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్లకు పారితోషికం పెంపు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అతిథి అధ్యాపకులు (గెస్ట్ లెక్చరర్లు)కు పారితోషికాన్ని పెంచుతూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో మొత్తం 19 ప్రభుత్వ జూనియర్ కళాశాలలుండగా, వీటిలో గెస్ట్ లెక్చరర్లుగా 56 మంది వివిధ సబ్జెక్టుల్లో పనిచేస్తున్నారు. వీరికి ఇప్పటివరకు బోధన నిమిత్తం గంటకు రూ.150లను చెల్లిస్తుండగా, వచ్చే జూన్‌నుంచి రూ.375 చొప్పున లెక్కించి పారితోషికాన్ని ఇవ్వనున్నారు. బోధనా గంటలు ఎక్కువగా ఉన్నప్పటికీ గరిష్ఠంగా నెలకు రూ.27 వేలు చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో గెస్ట్ లెక్చరర్లకు నిర్ణీత మార్గదర్శకాలకు లోబడి పారితోషికాన్ని చెల్లించేందుకు నిధుల మంజూరుకోసం ప్రతిపాదనలను పంపినట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి టి.శేఖర్‌బాబు తెలిపారు.

ఏడాది క్రితం సరిగ్గా ఇదే తేదీన జనం ఓటు రూపంలో అప్పటి వైసీపీపై పాశుపతాస్త్రం సంధించారు. ఆనాటి ప్రభుత్వం అణచివేత చర్యలు, అక్రమ కేసులు, ప్రతీకారదాడులు పార్టీ పరంగా విభజనలు, పోలీసుల ఓవర్ యాక్షన్‌లను ప్రజలంతా సైలెంట్‌గా కుమ్మేసిన రోజు అది. ఎక్కడికక్కడ బ్యాలెట్ బాక్సులను నింపేశారు. కనీవినీ ఎరుగని రీతిలో మండుటెండను ఖాతరు చేయకుండా ఉమ్మడి పశ్చిమలో ఓటరు పోటెత్తిన క్షణాలవి. పోలింగ్ కేంద్రాల్లో కొన్నిచోట్ల బారులుతీరి కనిపిస్తే, మరికొన్ని చోట్ల ఒకొక్కరిగా బ్యాలెట్లోకి ఓట్లను నింపారు. వస్తున్న వారంతా తమ పార్టీ అనుకూలురే అని ఎవరంతట వారు లెక్కలు కట్టారు. మహిళా ఓటర్లు రెండో మాట మాట్లాడకుండా నింపాదిగా వచ్చి అందరి లెక్కలకు అందనంతగా తీర్పును బ్యాలెట్‌లో రిజర్వ్ చేశారు. ఆనాడు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 14 నియోజకవర్గాల్లో ఓటరు ఇచ్చిన తీర్పు నభూతో నభవిష్యత్.





ఓటు వేసేందుకు క్యూ కట్టిన ఓటర్లు (ఫైల్)

మార్పు కోసం..

ఓటెత్తిన చైతన్యానికి నేటితో ఏడాది

- ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల పోలింగ్‌ను గుర్తు తెచ్చుకున్న ప్రజలు
- ఒత్తిళ్ల మధ్యే నాడు బ్యాలెటు బాక్సులు నింపిన ఓటర్లు
- సరైన నేతలను ఎన్నుకునే దిశగా సైలెంట్ ఓటింగ్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఐదేళ్ల అరాచకంపై ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా ఓటర్లు తీర్పు ఇచ్చిన రోజది. 2024 మే 13న అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు పోలింగ్ జరిగింది. అంతకుముందు వరకు నియోజక వర్గాల వారీగా చెప్పలేని విధంగా వైసీపీ బెదిరింపులు పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వినియోగించుకుంటామో లేదోననే బెంగ అందరిని పీడించింది. మరోవైపు ఊరూ, వాడా ఓటర్లపై ఒత్తిళ్లు. కాదు,కూడదని ముందుకెళ్తే ఆ తర్వాత ఆస్తులు మిగలవంటూ అనేక కుటుంబాలకు బెదిరింపులు. టీడీపీ, జనసేనను లక్ష్యంగా చేసుకుని ఎక్కడికక్కడ దాడులు పైకి చెప్పుకోవడానికి వీల్లేనంతగా దుర్భాషలు. మండల, నియోజకవర్గ కేంద్రాల్లోను వైసీపీ క్యాడర్ మోహరింపు. తమ అంచనాలకు భిన్నంగా వెళ్లనీయకుండా ఎక్కడికక్కడ అడ్డంకులు. ప్రలోభ పెట్టి దారి మళ్లింపు, అయినా ఓటు హక్కు వినియోగించుకోవాలన్న సంకల్పం దిశగా లక్షలాది మంది ఓటర్లు. ఇంతకుముందు మాదిరిగా కాకుండా గ్రామాలకు గ్రామాలే కదిలిన రోజు అది. ఏలూరు జిల్లాలో అనేక సమస్యాత్మక గ్రామాలకు తోడు, వైసీపీ సృష్టించిన సమస్యలు కొకొల్లలు. అలాంటి ఉద్రిక్తతల మధ్య సంయమనంతో ఓటర్ల అంతా బారులు తీరారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఏలూరు పార్లమెంట్ స్థానానికి 13 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. ఏడు అసెంబ్లీ స్థానాల్లో 86 మంది రంగంలో ఉన్న ఎక్కడ తడబడకుండా సైలెంట్‌గా ఓటేశారు. పశ్చిమ గోదావరిలో ఎంపీ స్థానానికి 18 మంది, ఏడు అసెంబ్లీ స్థానాలకు 65 మంది పోటీపనా ఎవర్ని గెలిపించాలో ఒక స్థిర నిర్ణయానికి వచ్చి ఆ దిశగానే కదిలారు. అప్పట్లో ఓటింగ్ శాతం పూర్తిగా పడిపోతుందని ముందుగా భావించారు. కానీ ఎక్కడా వెనక్కి తగ్గలేదు. బెదిరింపులను మౌనంగా ఎదుర్కొని, అంతే నిశ్శబ్దంగా ఓట్లను సంధించారు. నర్సాపురం లోకసభ స్థానంలో 81.12 శాతం, ఏలూరులో 83.04 శాతం ఓట్లు నమోదు చేసి సునామీ సృష్టించారు. గతేడాది ఇదే రోజు పోలింగ్ పూర్తి అయినా ప్రజాతీర్పు కోసం కొన్నాళ్ల వేచి ఉండాల్సి వచ్చింది. సార్వత్రిక ఎన్నికల్లో ఇలా ఉత్కంఠభరితంగా బెదిరింపుల మధ్య పోలింగ్ సాగడం ఇప్పటికీ అందరి మదిలోనూ పదిలం. పోలింగ్ నాడు సైతం వైసీపీ మూకలు రెచ్చిపోయి దాడులకు తెగబడడం కొన్ని ప్రాంతాల్లో ఎవ్వరు మరచిపోలేని సంగతి. ప్రశాంతతకు మారుపేరైన ఉమ్మడి పశ్చిమలో సైతం అల్లర్లను ప్రేరేపించేలా చివరి క్షణం వరకు ఆనాడు వైసీపీ ప్రయత్నించింది. తెరవెనుక అనేక రాజకీయ కుట్రలకు నాంది పలికింది.

అప్పుడే ఏడాది అయిందా ?

ఉత్కంఠ భరిత క్షణాల మధ్య గతేడాది ఇదే రోజు పోలింగ్ జరిగింది. ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు నువ్వానేనా అన్నట్లుగా సాగిన పోరులో ఓటర్లు తమతీర్పును బ్యాలెట్లలో భద్రపరిచేందుకు సాహోసేపేతంగా వ్యవహరించారు. అందుకనే మే 13వ తేదీ అందరి మదిలోనే చెరగని ముద్ర వేసింది. ముష్కర మూకలు తలదించుకునేలా ఓపిగ్గా ఓటర్లు వ్యవహరించి శభాష్ అనిపించుకున్నదీ గుర్తుకు తెచ్చుకుని అప్పుడే ఏడాది అయిందా అంటూ ఆ జ్ఞాపకాలను తలచుకుంటున్నారు.

కసరత్తు

- 2011 జనాభా ప్రాతిపదికగా పంచాయతీల పునర్విభజన
- నాలుగు గ్రేడ్‌లుగా విభజన.. జిల్లాలో 547 పంచాయతీలు
- అధికారులకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ



ఏలూరు సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కేటగిరీల వారీగా జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు పునర్విభజన (రీ కేటగిరైజేషన్) చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన డేటాను తయారు చేయాలని జిల్లా పంచాయతీ అధికారులను ఆదేశిస్తూ రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ ఈనెల 8న ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీలను గ్రేడ్‌ల వారీగా జనాభా ప్రాతి పదికన, ఆదాయం పరిగణలోకి తీసుకుని పంచాయతీలను వర్గీకరించాలని నిర్ణయించింది. గిరిజన పంచాయతీలను, నాన్ -ట్రైబల్ పంచాయతీలను విభజించడానికి ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించింది. ఈ ప్రకారం పంచాయతీల పునర్విభజన చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించారు. పంచాయతీలను పునర్విభజించడం వల్ల అభివృద్ధి వేగవంతంగా జరగడానికి, పరిపాలన సక్రమంగా జరగడానికి అవకాశం ఏర్పడుతుందని, సంక్షేమ కార్యక్రమాలు అందరికీ అందుబాటులోకి వస్తాయని, పారిశుధ్య కార్యక్రమాలు మెరుగుపడతాయని, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించ డానికి అవకాశం ఏర్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

గ్రేడ్‌ల వారీగా పంచాయతీల పునర్విభజన

జిల్లాలో 547 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిని నాలుగు గ్రేడ్‌లుగా విభజించాలని నిర్ణయించారు. నాన్‌ట్రైబుల్ పంచాయతీలకు, ట్రైబుల్ పంచాయతీలకు వేర్వేరుగా మార్గదర్శకాలు రూపొందించారు.

● నాన్ ట్రైబుల్ పంచాయతీలలో స్పెషల్ గ్రేడ్ పంచాయతీలకు 10 వేలు పైగా జనాభా ఉండాలని, పంచాయతీల ఆదాయం రూ.కోటి పైగా ఉండాలని నిర్దేశించారు. గ్రేడ్- 1 పంచాయతీకి 4వేలకు పైగా 10వేల లోపు జనాభా ఉండాలని, పంచాయతీ ఆదాయం రూ.50 లక్షలకు పైగా, రూ.కోటి లోపు ఉండాలని (మండల కేంద్రంలోని పంచాయతీగా ఉండవచ్చునని) నిర్ణయించారు. గ్రేడ్ - 2 పంచాయతీకి 2వేలకు పైగా 4 వేలు లోపుగా జనాభా ఉండాలని, గ్రేడ్- 3 పంచాయతీకి 2 వేలలోపు జనాభా ఉండాలి.

● ట్రైబుల్ పంచాయతీల్లో స్పెషల్ గ్రేడ్ పంచాయతీలకు 5వేల లోపు జనాభా ఉండాలని, గ్రేడ్-1 పంచాయతీకి 3 వేలుకు పైగా 5వేలు లోపు జనాభా ఉండాలని(మండల కేంద్రంలోని పంచాయతీగా ఉండవచ్చునని), గ్రేడ్- 2 పంచాయతీకి 1500కు పైగా 3వేలకు లోపు జనాభా ఉండాలని, గ్రేడ్- 3 పంచాయతీకి 1500కు పైగా జనాభా ఉండాలి.

ఈ ప్రకారం నాలుగు కేటగిరీల్లో పంచాయతీల పునర్విభజన కార్యక్రమం జరుగుతుంది. దీనికి సంబంధించి గ్రామ పంచాయతీల పునర్విభజనకు సంబంధించి జిల్లా పంచాయతీ అధికారి డీఎల్‌పీవో, ఈఆర్డీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి డేటా ను రూపొందిస్తారు. ఈ డేటాను కలెక్టర్ వారికి పంపించి, అక్కడ పరిశీలన తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రతి పంచాయతీకి గ్రామ కార్యదర్శి ఉండేలా చర్యలు తీసుకుంటారు. సిబ్బందిని నియమించే అవకాశాలున్నాయి.



మిర్చి రైతు కన్నీరు!

తగ్గిన దిగుబడులు.. ధరలు పతనం

- ఎకరానికి రూ.లక్ష పైనే నష్టం
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

వేలేరుపాడు, మే 12 (ఆంధ్రజ్యోతి) : మిర్చి పంటకు ధర లేక తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు, మూడేళ్ల క్రితం 2023 లో మిర్చిధరలు ఆకాశాన్ని తాకి లాభాల పంట కురిపించింది. క్వింటా మిర్చికి 24 వేల వరకు రైతు వద్దే కొనుగోలు చేయడంతో నికరంగా మంచిలాభాలే వచ్చాయి. వరుసగా రెండేళ్ల వైరస్, నల్లితెగులు సోకి దిగుబడులు గణనీయంగా పడిపోయాయి. ఈ ఏడాది తెగుళ్ల బెడదతో మిర్చి దిగుబడులు మరింత దారుణంగా పడిపోయాయి. మరోవైపు ధరలు సగానికి సగం పైనే పతనమయ్యాయి. గతేడాది, ఈ ఏడాది మిర్చి క్వింటా రూ.15 వేలు దాటలేదు. ఈ ఏడాది మొదట్లో క్వింటా రూ.13 వేల వరకు కొనుగోలు చేసిన వ్యాపారులు ఆ తర్వాత రూ.9వేలకు తగ్గించేశారు. చివరాకర్లో ఆ ధరలు మరింత పతనమై రూ.6 వేల నుంచి రూ.7 వేల లోపే క్వింటా మిర్చిని కొనుగోలు చేశారు.

ఎకరానికి 10-15 క్వింటాళ్ల దిగుబడులు

దిగుబడులు ఈ ఏడాది ఎకరానికి 10-15 క్వింటాళ్ల వరకు మాత్రమే దిగుబడులు వచ్చాయి. ధర ఉండి ఉంటే రైతులు ఎంతోకొంత ఒడ్డునపడేవారు. ధరలు, దిగుబడులు రెండు తగ్గడంతో రైతు పెట్టిన పెట్టుబడుల్లో సగం రాలేదు. ఒకవైపు ఎరువులు, పురుగుమందుల ధరలు ఆకాశాన్ని అంటుతుండగా కూలీల రేట్లు ఇతర పెట్టుబడులు గణనీయంగా పెరిగిపోయి ఎకరానికి రూ.3లక్షల వరకు పెట్టుబడి అయింది. వచ్చిన పంటను అమ్మగా అందులో సగం కూడా రాకపోవడంతో రైతులు ఎకరానికి రూ.లక్షకు పైనే నష్టపోయారు. గత రెండేళ్లలో మండలంలో మిర్చిసాగు 3 వేల ఎకరాలు పైనే సాగయ్యింది. ఇందులో అత్యధికం కౌలు రైతులే ఉన్నారు. ఇదిలా ఉంటే దళారుల మాటలు నమ్మి కొంతమంది రైతులు తమ మిర్చినిల్వలను తాడేపల్లిగూడెం, గుంటూరు, వరంగల్ ప్రాంతాల్లోని ఏసీ గోదాములకు తరలించి నిల్వ చేసుకున్నారు. వారు నిల్వ చేసుకున్న సమయంలో ఉన్న ధర కూడా ప్రస్తుతం లేదు. దీంతో రైతులు మరింత నష్టపోయే పరిస్థితి దాపురించింది. విదేశీ అర్డర్లు రాకపోవడం వలనే మిర్చికి ఈ దుస్థితి దాపురించినట్టు తెలుస్తుంది.

కూలి ఖర్చులు రావడం లేదు



ఈ ఏడాది 15 ఎకరాల్లో మిర్చిసాగు చేయగా చీడపీడలు వైరస్‌ల కారణంగా దిగుబడి తగ్గింది. ప్రస్తుతం క్వింటా మిర్చి రూ.6 వేల నుంచి రూ.7వేల వరకే ధర పలుకుతుంది. దీంతో కోత కూలి ఖర్చులు కూడా రావడం లేదు. గిట్టుబాటు కాక మిర్చి కోయకుండానే వదిలేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- మాచర్ల వెంకటేశ్వర్లు, నడిమిగొమ్ముకాలనీ

కోలుకోలేని నష్టం



20 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశాను. రెండేళ్ల క్రితం ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి రాగా నేడు 15 క్వింటాళ్లకు పడిపోయింది. గిట్టుబాటు ధర లభిస్తుందన్న ఆశతో కొంత మిర్చిని ఏసీ గోదాములో నిల్వ చేయగా ఆ ఖర్చులూ రావడం కష్టమే.

- వాసిరెడ్డి జగన్, శివకాశీపురం.

అధికారితో..

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

జిల్లా పరిధిలో భూములు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లు విషయంలో క్షేత్రస్థాయిలో ఇబ్బందులున్నాయా? అక్రమంగా నిషేధిత జాబితాలో చేర్చిన వివిధ భూముల వల్ల రిజిస్ట్రేషన్లు ఎక్కడైనా ఆగాయా?.. ఇతర సమస్యలపై ఈ నెల 14న బుధవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య' ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' నిర్వహించనుంది. ప్రజలు **70939 21440** నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను తెలిపితే వాటి పరిష్కారానికి ఏలూరు జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు చర్యలు తీసుకుంటారు.



ఏలూరులో రోడ్డుపైనే కూర్చుని భోజనం చేస్తూ నిరసన తెలుపుతున్న సీహెచ్‌వోలు

పోరుబాట

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా సోమవారం సమస్యల పరిష్కారం కోరుతూ ఉద్యోగులు, సీహెచ్‌వోలు, రైతులు పోరుబాట పట్టారు. ఏలూరు కలెక్టరేట్ ధర్నాలతో దద్దరిల్లింది.

■ లోపలి పేజీలో..

బాధ్యతాయుతంగా అర్జీల పరిష్కారం : కలెక్టర్

ఏలూరు/ ఏలూరు రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం ద్వారా అందిన అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌తో పాటు డీఆర్వో విశ్వేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ ఆర్.విజయరాజు, ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్, ఎస్ఈ కార్పొరేషన్ ఈడీ ఎం.ముక్కంటి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.భాస్కర్, శ్రీనివాసరావులతో కలిసి 258 అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్రా థీమ్ 'ఎండ వేడిమి నుంచి రక్షించుకునేందుకు' అనే కార్యక్రమంపై విస్తృతంగా అనేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

సారా తయారీదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి

సారా తయారీ, అమ్మకాలు సంపూర్ణంగా స్వస్తి పలికిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించే చర్యలను తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో నవోదయం-2.0 అమలుపై ఆమె సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా సారా తయారీని విడిచిపెట్టిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేందుకు డీఆర్డీఏ, వ్యవసాయ, ఉద్యానశాఖ, పశుసంవర్థక శాఖ, సెట్వెల్, స్కిల్ డెవలప్‌మెంట్, జిల్లా పరిశ్రమల తదితర శాఖల అధికారులు ఎక్సైజ్ అధికారులతో చర్చించి వారంలోగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

నేడు ఏలూరు రైల్వేస్టేషన్‌లో మాక్ డ్రిల్

శత్రుదాడి జరిగినప్పుడు సంసిద్ధతను అంచనా వేసేందుకు ఈనెల 13న మంగళవారం ఉదయం 10 గంటలకు భద్రతా మాక్‌డ్రిల్ నిర్వహించేందుకు సన్నాహాలు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మాక్‌డ్రిల్ నిర్వహణపై సోమవారం అధికారులతో ఆమె సమీక్షించారు. వైమానిక దాడులు జరిగితే తీసు కోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో ఎలా ప్రతిస్పందించాలో అవగాహన పరచాలన్నారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది, జిల్లా అధికార యంత్రాంగంతో పాటు అందరూ భాగ స్వాములు కావాలన్నారు.



బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ కిశోర్

న్యాయం చేస్తాం..

ఎస్పీ కేపీఎస్ కిశోర్.. ఫిర్యాదుల స్వీకరణ

ఏలూరు క్రైం, మే 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు తమ సమస్యలను పోలీస్‌శాఖకు స్వేచ్ఛగా తెలపడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం ఉపయోగపడుతుందని ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఎస్పీతో పాటు ఏఎస్పీ సూర్యచంద్రరావు 40 ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులను విచారించి న్యాయం చేస్తామన్నారు.

షేర్ మార్కెట్ జోరు..

మదుపుదారుల్లో జోష్

జిల్లాలో రూ.20 కోట్ల పైనే లాభాలు

తిరోగమనంలో పసిడి ధర

నరసాపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని స్టాక్ మార్కెట్ మదుపుదారుల్లో సోమవారం జోష్ నెలకొంది. ఇప్పటి వరకు బ్లాక్ మండే మార్కెట్లనే చవి చూసిన మదుపుదారులు మండే రోజు ఆల్‌టైం ఇండెక్స్ రికార్డును కూడా చూసేశారు. గడిచిన 25 ఏళ్లల్లో ఇండెక్స్ 29 వేల పాయింట్లు పెరగడం ఇదే తొలిసారి. గతేడాది ఎన్నికల ఫలితాల సమయంలో ఇండెక్స్ 2678 పాయింట్లకు పెరిగింది. అదే ఆల్‌టైం అనుకున్నారు. అయితే ఆ రికార్డును సోమవారం సూచికలు క్రాస్ చేశాయి. దీంతో మదుపుదారుల పెట్టుబడులకు భారీ లాభాలు దక్కాయి. ఉభయ గోదావరి జిల్లాల్లో ఒక్క రోజే మదుపుదారులు రూ.20 కోట్లుపైనే లాభాలను చవి చూశారు. అన్ని కంపెనీల షేర్లు పెరగడంతో పెట్టినపెట్టుబడుల్లో నష్టాలు తగ్గి లాభాలు బాట పట్టారు. గతేడాది సెప్టెంబరు నుంచి మార్కెట్‌లో తీవ్ర ఒడిదుకుడులు నెలకొంటూ వచ్చాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలతో మార్కెట్‌లు భారీ పతనాన్ని నమోదు చేసుకున్నాయి. అయితే వీటిని అమెరికా తగ్గించినా ఇండియా- పాకిస్తాన్ వార్‌తో మార్కెట్ మళ్లీ వెనక్కి తిరిగింది. యుద్ధం ఇప్పట్లో ముగియదని అంతా భావించారు. అయితే కాల్పుల విరమణకు రెండు దేశాలు అంగీకరించడం, ఇటు అమెరికా, చైనా దేశాలు విధించుకున్న సుంకాలను తాత్కాలికంగా విరమించుకోవడంతో మార్కెట్‌లో ఒక్కసారిగా జోష్ వచ్చింది. దీంతో సూచికలు ప్రారంభం నుంచి చివరి వరకు దూసుకు పోయాయి. లక్ష రూపాయిలు పెట్టుబడి పెట్టిన మదుపుదారులు కనీసం రూ.8 నుంచి రూ.10 వేల వరకు లాభాలను చూశారు. అదే రూ.10 లక్షలు పెట్టుబడి పెట్టి ఉంటే రూ.50 నుంచి రూ.60 వేల వరకు లాభాలు కనిపించాయి.

తిరోగమనంలో పసిడి ధరలు

మార్కెట్‌లో అలుముకున్న మబ్బులు వీడటంతో పసిడి ధరలు సోమవారం తిరోగమనం పట్టాయి. మార్కెట్ ముగిసే సమయానికి పది గ్రాముల ఆర్నమెంట్ బంగారం రూ.88,600 ఉండగా బిస్కెట్ బంగారం రూ.96,300 ఉంది. ఒక్క రోజే గ్రాముకు రూ.250 చొప్పున తగ్గింది. గడిచిన నెల రోజుల్లో పసిడి ఈ స్థాయిలో తగ్గడం ఇదే తొలిసారి. దీంతో రానున్న రోజుల్లో పసిడి ధర మరింత కిందకుపడే అవకాశం ఉందని బులియన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వెండి ధర కూడా రూ.లక్షకు దిగింది. కేజీ వెండి రూ.97 వేల వద్ద స్థిరంగా కొనసాగుతుంది.





గోదావరి మాతకు హారతి

సిద్దాంతం వశిష్ఠ గోదావరి వద్ద సోమవారం రాత్రి పౌర్ణమి సందర్భంగా హిందూ ధర్మపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గోదావరికి మాతకు పంచ హారతులు నిర్వహించారు. అధికసంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు. - పెనుగొండ (ఆంధ్రజ్యోతి)



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

వేసవిలో ఆట విడుపు

బాస్కెట్ బాల్‌లో శిక్షణ

తాడేపల్లిగూడెం రూరల్, మే12 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ఎప్పుడు వస్తాయా అమ్మమ్మ ఇంటికి ఎప్పుడు వెళదామా అని సరదా పడుతుంటారు.. కానీ ఇప్పుడు విద్యార్థుల మైండ్ సెట్ మారింది.. వేసవి సెలవులను కూడా సద్వినియోగం చేసుకోవాలని అనుకుంటున్నారు. తమ అభిరుచులకు అనుగుణంగా సమ్మర్ క్యాంపులు సద్వినియోగం చేసుకుంటూ ఆనందంగా గడుపుతున్నారు. కొందరు కరాటే, ఇంకొందరు నృత్యం, మరికొందరు స్కేటింగ్, బాస్కెట్ బాల్ ఇలా ఎవరికి నచ్చిన దాంట్లో వారు శిక్షణ పొందుతున్నారు. చిన్నారులకు ఆట విడుపుతో పాటు వారి భవిష్యత్ ప్రణాళికలో భాగంగా క్రీడలను అలవాటు చేస్తున్నారు నేటి తల్లిదండ్రులు. తాడేపల్లిగూడెంలో కోడే వెంకట్రావు మున్సిపల్ హైస్కూల్‌లో వ్యాయామోపాధ్యాయుడు చింతకాయల సత్యనారాయణ సుమారు 35 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా బాస్కెట్‌బాల్ క్యాంపు నిర్వహిస్తూ చిన్నారులకు బాస్కెట్‌బాల్‌లో మెలకువలు నేర్పిస్తున్నారు. సుమారు వంద మంది విద్యార్థులు ఇక్కడ శిక్షణ తీసుకుంటున్నారు. ఆయన దగ్గర శిక్షణ తీసుకున్న వారిలో చాలామంది జాతీయ పోటీలకు ఎంపిక అవ్వడంతో పాటు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించారు.

35 ఏళ్లుగా శిబిరం ద్వారా శిక్షణ



35 సంవత్సరాలుగా ప్రతీ సంవత్సరం వేసవిలో బాస్కెట్‌బాల్ క్యాంపులు నిర్వహిస్తు న్నాను. ఇప్పటికే ఇక్కడ శిక్షణ పొందినవారు పలువురు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అవడంతో పాటు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించారు. దేవుడు ఇచ్చిన విద్యతో పలువురికి శిక్షణ ఇస్తూ ముందుకు వెళ్లాలన్నదే నా అభిమతం.

చింతకాయల సత్యనారాయణ, ట్రైనర్

ఆటాడేస్తాం..



- నాకు క్రీడలంటే మక్కువ. కానీ మేం చదివే పాఠశాలల్లో చదువుకు తప్ప క్రీడలకు ప్రాధాన్యం ఉండదు. ఇప్పుడే నేను పదో తరగతి పూర్తిచేశా. బాస్కెట్‌బాల్ శిక్షణ తీసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది.

ఎ.పవన్ తేజ, తాడేపల్లిగూడెం



- మాది హైద్రాబాద్.. అక్కడ అంతా బిజీ ప్రపంచం. ఇటీవలే మా కుటుంబం ఇక్కడకు వచ్చేశాం. నేను ఏడో తరగతి చదువు తున్నాను. నాకు ఆటలంటే ఇష్టం.నా అభిరుచికి తగ్గట్టుగా బాస్కెట్‌బాల్ క్యాంపులో చేర్పించడం ఎంతో ఆనందంగా ఉంది. బాస్కెట్ బాల్‌లో బేసిక్స్ నేర్చుకుని మంచి క్రీడాకారిణిగా ఎదగాలన్నదే నా కోరిక.

బి.రిత్విక, హైద్రాబాద్



- మా ఇంట్లో నన్ను ఎంతో ప్రోత్సహిస్తారు. జూనియర్ లెవల్‌లో వంద మీటర్ల పరుగు పందెంలో స్టేట్‌లో గోల్డ్‌మెడల్ సాధించాను. ఇప్పుడు బాస్కెట్ బాల్‌లో కూడా శిక్షణ తీసుకుని క్రీడాకారిణిగా ఎదగాలన్నదే నా కోరిక.

ఎస్.శ్వేత, తాడేపల్లిగూడెం



- నాకు ఆటలంటే చాలా ఇష్టం. ఈ వేసవిలో చుట్టాలింటికి వెళ్లాలన్న ఆలోచన కూడా మార్చు కున్నాను. అనుభవం ఉన్న సార్ దగ్గర నేర్చుకోవడం మా అదృష్టం.

ఎం.రిత్విక్ హర్ష, తాడేపల్లిగూడెం

తిరువీధుల మెరిసెనే.. దేవదేవుడు

చిన్నతిరుపతిలో వైభవంగా శ్రీవారి రథోత్సవం

ద్వారకాతిరుమల, మే 12 (ఆంధ్రజ్యోతి): కనకపు కొండవంటి రథముపై ధనుజ మర్ధనుడెక్కె రమణులతో.. అంటూ పదకవితా పితామహుడు అన్నమయ్య ఆలపించిన కీర్తనలు ఇక్కడ ఆవిష్కృతమయ్యాయి. చిన్నతిరుమలేశుని రథ రంగ డోలోత్సవం క్షేత్రపురవీధుల్లో సోమవారం రాత్రి అట్టహాసంగా జరిగింది. సమ్మోహితమైన రూపంతో అభయహస్తాన్ని ప్రసాదిస్తూ ఉభయ నాంచా రులతో కొలువై రథంపై పురవీధుల్లో విహరిస్తున్న చిన వెంకన్నను వీక్షించిన భక్తులు పరవ శించారు. శ్రీవారి వైశాఖ మాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన రథోత్సవం భక్తజనులకు కన్నుల పండువైంది. శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం మరుసటి రోజున రథోత్సవం జరపడం సంప్రదాయంగా వస్తున్నది. డప్పు వాయిద్యాలు, కోలాట భజనలు, విచిత్ర వేషధారణలు, భక్తుల గోవింద నామాల నడుమ క్షేత్రపురవీధుల్లో స్వామివారి రథం తిరుగాడింది. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు స్వామివారిని దర్శించుకుని రథోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ రాజా ఎస్‌వీ సుధాకరరావు, ట్రస్టీ ఎస్వీ నివృతరావు, ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తిలు తొలుత రథానికి బలిహరణ సమర్పించారు.

రాజమన్నార్‌గా.. శ్రీవారు

రాజమన్నార్ అలంకరణలో చినవెంకన్న దర్శనం భక్తులకు నేత్రపర్వమైంది. వైశాఖ మాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా రోజుకో అలంకారంలో కటాక్షిస్తున్న స్వామివారు సోమవారం చంద్రకోలు, దండం ధరించి సర్వాభరణాలతో రాజమన్నార్‌గా భక్తులను అనుగ్రహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.



ద్వారకాతిరుమల క్షేత్రంలో రథంపై ఊరేగుతున్న చిన వెంకన్న



స్వామివారి రథోత్సవంలో భక్తజన సందోహం

ఏడుకొండల వాడా..గోవిందా..గోవింద..

శోభాయమానంగా కాళ్లకూరు వెంకన్న రథయాత్ర

కాళ్ల, మే 12 (ఆంధ్రజ్యోతి) : ఏడుకొండల వాడా.. వెంకటరమణా..గోవిందా.. గోవింద.. అంటూ భక్తుల నామస్మరణతో కాళ్లకూరు గ్రామం మారుమోగింది. కాళ్ల మండలం కాళ్లకూరులో వేంకటేశ్వరస్వామి వారి తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారి రథయాత్ర శోభాయమానంగా జరిగింది. సుందరంగా అలంకరించిన రథంపై స్వామి వారు ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. బుట్టబొమ్మలు, శక్తివేషాలు, తీన్మార్ డప్పులు, మేళతాళాలు విశేషంగా ఆకర్షించాయి. పుర వీధుల గుండా సాగిన రథోత్సవంలో స్వామి వారిని చూసేందుకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో కాళ్లకూరులోని దారులన్నీ కిక్కిరిసిపోయాయి. వైశాఖ పౌర్ణమి సందర్భంగా శ్రీస్వామి, అమ్మవార్లను ఏపీ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు, రమాదేవి దంపతులు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజుతో పాటు పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ట్రాఫిక్ నియంత్రణకు కాళ్ల పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.ఈవో ఎం.అరుణ్‌కుమార్, సిబ్బంది పర్యవేక్షించారు.



కాళ్లకూరు వెంకన్నను దర్శించుకున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ దంపతులు

సీబీఎస్ఈ ఫలితాలెప్పుడో?

విద్యార్థుల ఎదురుచూపులు



నరసాపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల్లో పది, ఇంటర్ సీబీఎస్ఈ పరీక్షలు రాసిన విద్యార్థులు ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. మే నెల వచ్చినా ఇంకా ఫలితాలు వెలువడ లేదు. ఎప్పుడు వస్తాయన్న దానిపై ఇంకా స్పష్టత లేదు. దీంతో విద్యార్థుల తల్లితండ్రుల్లో ఆందోళన నెలకొంది. స్కూళ్లకు ఫోన్ చేసి ఫలితాలు ఎప్పుడంటూ ఆరా తీస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది నిర్వహించిన పది, ఇంటర్ ఫలితాలు వచ్చాయి. ఇటు విద్యార్థులు వివిధ కాలేజీల్లో సీట్లు కూడా ఖరారు చేసుకున్నారు. కానీ సీబీఎస్ఈ ఫలితాలు ఇంత వరకు వెలువడక పోవడంతో విద్యార్థులను కాలేజీల్లో ఎక్కడ చేర్చాలన్న దానిపై తల్లితండ్రులు మల్లగుల్లాలు పడుతున్నారు. నరసాపురం, పాలకొల్లు, భీమవరం, తణుకు, టీపీగూడెం, ఏలూరు, జంగారెడ్డిగూడెం వంటి పట్టణాల్లో కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు సీబీఎస్ఈ సిలబస్‌ను కొనసాగిస్తున్నాయి. అధికారుల లెక్కల ప్రకారం ఈ ఏడాది ఉమ్మడి జిల్లాల్లో 12 వేల మందిపైనే సీబీఎస్ఈ సిలబస్‌లో పదో తరగతి పరీక్షలు రాశారు. ఇంటర్‌లో కూడా 4 వేల మందిపైనే ఉన్నారు. పది పరీక్షలు ఫిబ్రవరి 15న ప్రారంభమై మార్చి 15కి ముగిశాయి. ఇంటర్ పరీక్షలు కూడా మార్చిలో ముగిశాయి. పరీక్షలు ముగిసి 70 రోజులు గడిచినా నేటికి ఫలితాలు వెలువడలేదు.



బావాయిపాలెం ఉన్నత పాఠశాలలో పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

పదిపై ప్రత్యేక దృష్టి

సప్లిమెంటరీ విద్యార్థులకు స్పెషల్ తరగతులు

నిడమర్రు మే 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో కీలకమైనది పదో తరగతి. ఇన్నాళ్లు చదివిన చదువుకు గుర్తింపు రావాలన్నా, భవిష్యత్తు ప్రణాళికలకు మార్గం వేసుకోవాలన్నా పదో తరగతి అత్యంత కీలకం. పదవ తరగతితో విద్యార్థుల చదువు ఆగిపోకూడదనే విద్యాశాఖ ప్రధాన లక్ష్యం. మొన్న జరిగిన పది పరీక్షల్లో వివిధ కారణాలతో హాజరు కాలేని వారికి, ఉత్తీర్ణత సాధించ లేని వారి కోసం విద్యాశాఖఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మే నెలలో నిర్వహించనున్న సంప్లిమెంటరీ పరీక్షలలో అందరు విద్యార్థులు పాస్ అయ్యేలా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తు న్నారు. పది ఫెయిల్ అయిన విద్యార్థుల వివరాలు సేకరించి ఉపాధ్యాయులను వారి ఇళ్లకు వెళ్లి పాఠశాలకు రమ్మని చెప్పి ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఎక్కు వగా గణితం, సైన్స్, ఇంగ్లీషు సబ్జెక్టులలో ఫెయిల్ కావడంతో ఆయా సబ్జెక్టు ఉపాధ్యా యులు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు.

వేసవి సెలవుల్లోనూ ..

గతంలో వేసవి సెలవులు వచ్చాయంటే అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు మూటాముళ్ళు సర్దుకొని తమ సొంత ఊళ్లకు ప్రయాణాలు కట్టేవారు. నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మండు వేసవిలో ఎండలను సైతం లెక్కచేయకుండా ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లి స్వచ్ఛందంగా విద్యాబోధన చేస్తున్నారు. ఉదయం 7.45 నిమిషాల నుంచి 11.45 వరకు వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రతి ఇద్దరు సబ్జెక్టు ఉపాధ్యాయులు చొప్పున పాఠశాలకు వచ్చి విద్యార్థులకు మెళకులు నేర్పుతున్నారు.

19 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

మార్చినెలలో నిర్వహించిన పది పబ్లిక్ పరీక్షలలో ఉత్తీర్ణత కాని విద్యార్థుల కోసం విద్యాశాఖ సంప్లిమెంటరీ పరీక్షలను మే నెలలో నిర్వహిస్తోంది. మే 19 తేదీ నుంచి మే 26 వరకు జరిగే సంప్లిమెంటరీ పరీక్షలలో ఆయా విద్యార్థులు మరలా పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించి పైచదువులకు జాయిన్ కావచ్చు. ఉన్నత చదవులు అభ్య సించే అవకాశం కోసమే ఈ సంప్లిమెంటరీ పరీక్షలను మే నెలలో నిర్వహిస్తోంది. ఈనెల 18వరకు ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రత్యేక బోధన, పునశ్చరణ తరగుతులు నిర్వహిస్తారు.ఏలూరు జిల్లాలో సంప్లిమెంటరీ పరీక్షకు 5,091 మంది హాజరు కానున్నారు.

విద్యా సంవత్సరం నష్టపోకూడదు



పది పరీక్షలలో ఫెయిల్ అయిన విద్యా ర్థులకు అకడమిక్ సంవత్సరం నష్టపో కూడదనే ఉద్ధేశంతో సంప్లిమెంటరీ పరీక్షల కోసం విద్యార్థులకు పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నాం. రెమిడియల్ క్లాస్‌లతో పాటు అసైన్‌మెంట్‌లు కూడా నిర్వహిస్తున్నాం. పాస్ గ్యారెంటీ దిశగా వారికి తర్ఫీదు ఇస్తున్నాం. అన్ని సబ్జెక్టులు కవర్ అయ్యేలా శిక్షణా తరగతులు నిర్వహణ జరుగుతుంది.

ఎం.వెంకటలక్ష్మమ్మ డీఈవో, ఏలూరు

ప్రతి విద్యార్థి పాసవ్వాలి



పది పరీక్షల్లో ఉత్తీర్ణత కాని విద్యార్థుల కోసం ప్రత్యేకంగా తరగతులు నిర్వహి స్తున్నాం. వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు హాజరు తక్కువగా ఉంటోంది. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులను ఒప్పించి తరగతులకు హాజరయ్యేలా చేస్తున్నాం. ప్రతిరోజు రెండు సబ్జెక్టులపై క్లాస్‌లు నిర్వహించి అసైన్‌మెంట్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రతి విద్యార్థి సప్లిమెంటరీ పరీక్షలలో పాస్ అవ్వడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాం.

-యర్రంశెట్టి శేషగిరిరావు, హెచ్ఎం, ఉన్నత పాఠశాల, ఛానమిల్లి

పచ్చడి మామిడీలా

వెలవెలబోతున్న మార్కెట్



తాడేపల్లిగూడెం మార్కెట్ లో పచ్చడి మామిడి కాయల అమ్మకాలు

అందుబాటులో కాయల ధరలు

ఆసక్తి చూపని వినియోగదారులు

మే నెల గడిస్తే అమ్మకాలు కష్టమే అంటున్న వ్యాపారులు

పెంటపాడు, మే 12 (ఆంధ్రజ్యోతి) : పచ్చడి మామిడి కాయల బేరాలు ఇంకా నత్తనడకనే సాగు తున్నాయి. ఆదివారం మార్కెట్‌లో పచ్చడి మామిడి కాయల అమ్మకాలు ఇంకా ఊపందుకోలేదు. దీంతో వ్యాపారులు దిగాలు పడిపోయారు. వాస్తవానికి మే నెలలోనే చాలామంది పచ్చళ్లు పట్టుకుంటూ ఉంటారు. అయితే ఈ ఏడాది మే నెలలో ఇప్పటికే 10 రోజులు పైగా గడిచిపోయాయి. కానీ మామిడి కాయల అమ్మకాలు మాత్రం సరిగా జరగడం లేదు. రెండు వారాల క్రితం వ్యాపారులు మే నెలలో తమ వ్యాపారాలు పుంజుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే ఆ పరిస్థితి ఇంకా కానరావడం లేదు. మరో 15 రోజులు గడిస్తే పచ్చడి మామిడి కాయల సీజన్ ముగిసినట్లేనని గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది కాయల రేట్లు తగ్గినప్పటికి అమ్మకాలు మాత్రం జరగడం లేదని వ్యాపారులు వాపోతున్నారు

వాతావరణంలో మార్పులు



వాతావరణంలో మార్పులు కూడా పచ్చడి మామిడి సీజన్‌కు అంతరాయం కల్గిస్తున్నాయి . ఒక రోజు ఎండ మరో రోజు వాతావరణం చల్లగా మారుతుండటంతో పచ్చళ్లు పెట్టుకునేందుకు చాలా మంది సాహసించడం లేదు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పచ్చడి మామిడి కాయలు, మిరపకాయలు అన్ని ధరలు అందుబాటులోనే ఉన్నాయి. అయితే వినియోగదారులు మాత్రం మొగ్గు చూపడం లేదు. తాడేపల్లిగూడెం మార్కెట్‌లో ఆదివారం సుమారు 10 టన్నుల మామిడి కాయలు వచ్చాయి. కొత్తపల్లి కొబ్బరి, బిజర్లు, పెద్ద రసాలు తదితర ధరలు కూడా అందుబాటులోనే ఉన్నాయి. కాయ ఒకటి రూ.15 నుంచి రూ.20 చొప్పు అమ్మారు. ఇటీవల వచ్చిన గాలిదుమ్ముల ప్రభావం కూడా మామిడి అమ్మకాలపై పడిందని వ్యాపారులు చెబుతున్నారు. కాయలు ఎక్కువగా రాలిపోవడం వల్ల మెత్త బడిపోయి వ్యాపారాలు ముందుకు సాగడం లేదంటున్నారు.

రెడీమేడ్ పచ్చళ్ల వైపే మొగ్గు

చాలామంది తమ ఇళ్ల వద్ద మామిడి చెట్లు పెంచుతుంటారు. సంవత్సరానికి ఒకసారి కాసే మామిడి కాయలు చెట్ల రకాలను బట్టి కాస్తుంటాయి. ఒకవేళ ఎక్కువగా కాస్తే చెట్లు కల్గిన సొంత ఇంటివారితో సహా తమ బంధువులకు కూడా కాయలను ఉచితంగా పంచుతుంటారు. ఇది కూడా మామిడి కాయల అమ్మకాలకు అడ్డుకట్టగా మారుతుందని వ్యాపారులు తెలుపుతున్నారు. మరో వైపు గ్రామాలలో రెడీమేడ్ పచ్చళ్లు పట్టే వారి సంఖ్య కూడా పెరిగిపోతున్నది. ఇళ్ళ వద్దే మామిడి కాయలు పచ్చడ్లు పట్టి అమ్మకాలు జరుపుతున్నారు. మామిడి కాయ నాణ్యతను బట్టి వీరు ధరను నిర్ధారిస్తారు. మంచి రకం కాయ అయితే రెండు కేజీలకు సుమారు రూ.600 నాసి రకం అయితే రూ.500 లకు అమ్మకాలు జరుపుతుంటారు. ఇటువంటి వారు హోల్‌సేల్‌గా తమకు కావల్సిన కాయలను తోటలకు వెళ్లి కొనుగోలు చేస్తుంటారు. సమయం లేకపోవడం, పనిభారం కారణంగా చాలామంది తమకు కావల్సిన పచ్చళ్లను కేజీల చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా మామిడి కాయల అమ్మకాలు మార్కెట్‌లో వెలవెలబోతున్నాయి. వచ్చేవారం నుంచి అయినా తమ వ్యాపారాలు గాడిలో పడతాయో లేదోనని వ్యాపారులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన గన్ని


చంద్రబాబుకు కృతజ్ఞతలు చెబుతున్న గన్ని

భీమడోలు, మే 12 (ఆంధ్రజ్యోతి): ఆప్కాబ్ ఛైర్మన్‌గా నియమించడంపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయ జీవితంలో ఇంతటి సముచిత స్థానాన్ని తనకు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇచ్చిన పదవికి వన్నెతెచ్చేవిధంగా కృషి చేస్తానన్నారు.


ఎండ తీవ్రతతో ఏలూరు పవర్‌పేట రహదారి ఇలా..

ఎండ మండే

» భానుడి ప్రతాపంతో భగభగలు

» ఉమ్మడి పశ్చిమలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత

ఏలూరు సిటీ/ఆచంట, మే 12 (ఆంధ్రజ్యోతి): భానుడి భగభగలతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అట్టుడుకుతోంది. రెండు రోజులుగా జిల్లాలో తారస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఏలూరు, భీమవరం, తాడేపల్లిగూడెం, కొవ్వూరు, నిడదవోలు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, నూజివీడు, ఆకివీడు, భీమడోలు, ఆచంట తదితర ప్రాంతాల్లో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు 43 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు నమోదయ్యాయి. ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత మొదలైంది. 10 గంటలకు చాలా ప్రాంతాల్లో రహదారులపై జన సంచారం తగ్గింది. రాత్రి ఉష్ణోగ్రతలు 26 నుంచి 27 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు నమోద వుతుండడంతో రాత్రి సమయాల్లో ఉక్కబోత తప్పడం లేదు. గాలిలో తేమ శాతం తక్కువగా ఉండటంతో ఉక్కబోత పెరుగుతోంది. వృద్ధులు, చిన్న పిల్లలు ఉక్కబోత తట్టుకోలేక అవస్థలు పడుతున్నారు.

నేడు వేడిగాలుల తీవ్రత

ఈనెల 13న వేడిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఏలూరు జిల్లాలో ఒక చోట మంగళవారం అతి తీవ్రంగా వేడిగాలులు, 9 చోట్ల తీవ్రంగా వేడిగాలులు వీస్తాయని, పశ్చిమ గోదావరి జిల్లాలో 7 చోట్ల తీవ్రంగా వేడిగాలులు వీస్తాయని, తూర్పు గోదావరి జిల్లాలో 8 చోట్ల తీవ్రంగా వేడిగాలుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలిపింది. మిగిలిన ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఆ సంస్థ తెలిపింది.


జన సంచారం తగ్గడంతో ఖాళీగా ఉన్న ఆచంట ప్రధాన రహదారి

జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నారాయణ



ఏలూరు క్రైం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఏలూరుకు చెందిన న్యాయవాది ఏవీ.నారాయణ సోమవారం బాధ్యతలను చేపట్టారు. నారాయణను ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్లపాటు ఆయన కొనసాగనున్నారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు పలువురు న్యాయవాదులు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

పౌర రక్షణ వలంటీర్లుగా చేరండి

ఏలూరు క్రైం, మే 12 (ఆంధ్రజ్యోతి): యువత పౌరరక్షణ వలంటీర్లుగా పేరు నమోదు చేసుకోవాలని నెహ్రూ యువకేంద్ర జిల్లా యువజన అధికారి సుంకర రాము కోరారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. యువతను 'మై భారత్ సివిల్ డిఫెన్స్ వలంటీర్లు'గా నమోదు చేసుకోవడానికి భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల, క్రీడల మంత్రిత్వశాఖ చర్యలు చేపట్టిందన్నారు. వలంటీర్లు అత్యవసర పరిస్థితులు, సంక్షోభ సమయాల్లో జాతీయ ప్రయోజనంలో కీలకపాత్ర పోషించడానికి యువతను శక్తిమంతం చేయడానికి సమష్టి ప్రయత్నం చేపట్టిందన్నారు. ప్రజా అత్యవసర పరిస్థితులు, ఇతర ఊహించని పరిస్థితులు, పౌర పరిపాలనపై ప్రతిస్పందించే, స్వచ్ఛంద దళాన్ని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ చాలా సులభమని అధికారిక మై భారత్ పోర్టల్‌లో ఆసక్తి గల యువత పేరు నమోదు చేయించుకోవచ్చునన్నారు. మరిన్ని వివరాలను జిల్లా యువజన అధికారి సుంకర రాము సెల్ నెంబర్ 9966357021, మైభారత్ రాష్ట్ర డైరెక్టర్ అన్సుమన్ ప్రసాద్ దాస్ సెల్ నెంబర్ 9437505290 లేదా నెహ్రూ కేంద్ర ఏలూరు కార్యాలయ ఫోన్ నెంబర్ 08812- 230860ను సంప్రదించాలని సూచించారు.


నెమలిపేటలో జామాయిల్ కటింగ్‌ను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో శుభం

జామాయిల్ ఎగుమతి పరిశీలించిన అధికారులు

కుక్కునూరు, మే 12(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు, అమరవరం అటవీ రేంజ్‌లలో సోమవారం డీఎఫ్‌వో శుభం, ఫ్లైయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ శ్రీనివాసరావు సందర్శించారు. కుక్కునూరు అటవీరేంజ్ పరిధిలో కొన్ని రోజులుగా జామాయిల్ కటింగ్ జరుగుతోంది. ఇప్పటికే మారేడుబాక బీట్ పరిధిలో రెండు ఎకరాలు జామాయిల్ కట్ చేసి ఐటీసీ సారపాకకు తరలించారు. నెమలిపేటలో నాలుగు హెక్టార్లలో వేసిన జామాయిల్ కటింగ్ పనులను డీఎఫ్‌వో శుభం పరిశీలించారు. రాయికుంట బీట్‌లో అటవీప్రాంతాన్ని ఆక్రమణలకు గురికాకుండా చూడాలని డీఎఫ్‌వో ఆదేశించారు. మారేడుబాక నర్సరీలో మొక్కల పెంపకాన్ని ఫ్లైయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో శ్రీనివాసరావు పరిశీలించి సూచనలు ఇచ్చారు. అమరవరం అటవీరేంజ్‌లో పోడుపేరుతో భూములు ఆక్రమణలకు గురవుతున్నట్లు ఫిర్యాదులు వెళ్లడంతో అటవీశాఖ ఉన్నతాధికారులు ఆ ప్రాంతాలు పరిశీలించినట్లు సమాచారం. కార్యక్రమంలో కుక్కునూరు రేంజర్ కృష్ణకుమారి, డీఆర్‌ఓ కేసరి, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్

తరగతి గది నుంచి ఉద్యోగానికి మార్గం

మూడు దశాబ్దాలు వెనక్కి వెళితే పాలిటెక్నిక్ విద్యార్థులకే కాదు తల్లిదండ్రులకు సైతం ఒక కల. ప్రస్తుత ఐఐటీ స్థాయి క్రేజ్ పాలిటెక్నిక్ కళాశాలల సొంతం. పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, ఆతృతగా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష రాయడం, సీటు రాకుంటే నిరాశగా ఇంటర్‌లో చేరడం పరిపాటి. క్రమేపీ కార్పొరేట్ విద్యా సంస్థల మాయాజాలంతో పాలిటెక్నిక్ మసకబారింది. ఇంటర్‌లో చేరడం, తర్వాత మెడిసిన్, ఐఐటీ వైపు చూడడం సర్వసాధారణమైంది. అప్పట్లో పాలిటెక్నిక్ కళాశాలలో సీటు దొరకడమే మహాభాగ్యం అనుకుంటే ఇప్పుడు సీట్లు భర్తీకాని పరిస్థితి. విద్యార్థి దశలో అతి చిన్న వయసులో ఉద్యోగావకాశాలున్న ఏకైక మార్గం పాలిటెక్నిక్.. అందుబాటులో ఉన్న డిప్లొమా కోర్సులపై పరిశీలన.

» డిప్లొమా కోర్సులకు ఆదరణ అంతంత మాత్రమే

» జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో సగం సీట్లు ఖాళీ

» ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకులు, వసతుల కొరత

» ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలపై అవగాహన కార్యక్రమాలు

» ఈ ఏడాది ప్రవేశ పరీక్షకు పెరిగిన విద్యార్థుల సంఖ్య

తాడేపల్లిగూడెం రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదివిన విద్యార్థుల భవితకు పాలిటెక్నిక్ ఒక భరోసా. ఇప్పుడు ఆ పరిస్థితి తారుమారైంది. కార్పొరేట్ విద్యా సంస్థల మాయాజాలంతో పాలిటెక్నిక్ కళాశాలల వైభవం కనుమరుగైంది. డిప్లొమా కోర్సు పూర్తి చేసిన తర్వాత 18, 19 ఏళ్ల వయసులో ప్రభుత్వం రంగ సంస్థలలో ఉన్నత ఉద్యోగావకాశాలు ఉన్న ఏకైక మార్గం పాలిటెక్నిక్. ఇంటర్మీడియన్ ప్రవేశాల కోసం కార్పొరేట్ విద్యా సంస్థల ప్రచార మాయాజాలంతో విద్యార్థుల తల్లిదండ్రులు మెడిసిన్, ఐఐటీ మోజులో పడిపోయారు. దీనితో ప్రైవేటు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో సగం సీట్లు కూడా భర్తీ కాని పరిస్థితి నెలకొంది. జిల్లాలో ఒక ప్రభుత్వ, 8 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. వాటిలో సీట్ల భర్తీ కావడం లేదు. ముఖ్యంగా సివిల్, మెకానికల్ కోర్సుల్లో ప్రవేశానికి ఎవరూ ముందుకు రాని పరిస్థితి. జిల్లాలో మొత్తం 3600 పాలిటెక్నిక్ సీట్లు ఉండగా వాటిలో 1460 మాత్రమే సీట్లు భర్తీ కావడం పాలిటెక్నిక్ కోర్సులపై ఉన్న ఆదరణకు అద్దం పడుతోంది.

సీట్లు మార్పు చేసినా..

విద్యార్థులు సివిల్, మెకానికల్ కోర్సుల్లో చేరడానికి ఇష్టపడడంలేదని ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల యాజమాన్యం ఆ సీట్లను ఈసీఈ, కంప్యూటర్ సైన్స్ సీట్లుగా మార్పు చేసుకున్నారు. అయినా సీట్లు భర్తీకాక పాలిటెక్నిక్ కళాశాలలు అడ్మిషన్స్ కోసం తహతహలాడుతున్నాయి.

జిల్లాలోని తాడేపల్లిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, మెకానికల్ కోర్సులు ఉన్నాయి. ప్రైవేటు కళాశాలల్లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ బ్రాంచ్‌లలో సీట్లు ఉన్నాయి. డిప్లొమా కోర్సులపై సరైన ఆదరణ లేక పోవడంతో నిర్వహణకు తలలు పట్టుకునే పరిస్థితి. డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు పలు ప్రభుత్వ రంగ సంస్థల్లో అవకాశాలు ఉన్నాయి. ఉన్నత చదవాలనుకుంటే నేరుగా బీటెక్ రెండో సంవత్సరంలో ప్రవేశించే అవకాశం ఉంది. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడంతో ఆసక్తి కనబరచడం లేదు.

120 సీట్లకు 88 సీట్లు ఖాళీ

తాడేపల్లిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పరిస్థితి మరింత దయనీయం. సివిల్, మెకానికల్ కోర్సుల్లో 120 సీట్లు అందుబాటులో ఉన్నాయి. గత ఏడాది 32 సీట్లు మాత్రమే భర్తీ కావడంతో 88 సీట్లు ఖాళీగా ఉన్నాయి. గత ఏడాది పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష రాయని పదో తరగతి ఉత్తీర్ణులకు సైతం పలు కళాశాలల్లో ప్రవేశం కల్పించడం గమనార్హం.

అధ్యాపకుల కొరత

జిల్లాలో ఏకైక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అయిన తాడేపల్లిగూడెంలో అధ్యాపక సిబ్బంది కొరత వేధిస్తోంది. 30 మంది అధ్యాపకులకు 10 మంది మాత్రమే ఉన్నారు. మెకానికల్‌లో ముగ్గురు లెక్చరర్స్ మాత్రమే ఉన్నారు. వారిలో ఒక హెడ్, ఒక లెక్చరర్స్ అవసరం ఉంది.


తాడేపల్లిగూడెంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

ప్రభుత్వ పాఠశాలల్లో అవగాహన సదస్సులు

డిప్లొమా కోర్సులతో కెరీర్ ఎలా ఉంటుంది, ఉద్యోగావకాశాలు, తదితర అంశాలతో గత ఫిబ్రవరి నుంచి పాలిటెక్నిక్ అధ్యాపకులు క్యాంపెయిన్ చేశారు. 60 ప్రభుత్వ పాఠశాలల్లో 2వేల మందికి పైగా విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాలిసెట్‌కు ఉచిత శిక్షణ కూడా ఇచ్చారు. పాలిసెట్ ఫలితాలు త్వరలో విడుదల కానున్నాయి.

అవగాహన కల్పిస్తున్నాం



పాలిటెక్నిక్ కోర్సులు అంటే గతంలో సీట్లు దొరక్క చాలా పోటీ ఉండేది. కానీ ప్రస్తుతం ఆ కోర్సులకు ఆదరణ లేదు. పాలిటెక్నిక్ పూర్తిచేసిన ప్రతీ ఒక్కరికి ఉద్యోగావకాశం ఉన్నా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల చాయిస్‌లో అది ఉండడం లేదు. ఈ కోర్సులపై అవగాహన పెంచాం. గతం కంటే ఈ ఏడాది పాలిటెక్నిక్ కోర్సులకు ఆదరణ బాగుంటుంది.

బి.ఫణీంద్ర ప్రసాద్, పాలిటెక్నిక్ కళాశాల జిల్లా కోఆర్డినేటర్




ఏలూరు కలెక్టరేట్ వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా, వంట వార్పుతో సీహెచ్‌వోల నిరసన, కాళ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతుల ధర్నా

పోరుబాట

సమస్యల పరిష్కారం కోరుతూ ఉద్యోగులు, సీహెచ్‌వోలు, రైతులు పోరు బాట పట్టారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, ఉపాధ్యాయుల బదిలీ విధానాలపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సీహెచ్‌వోలు 15 రోజులుగా చేపట్టిన ఆందోళనలో భాగంగా వంట వార్పుతో నిరసన వ్యక్తం చేశారు. కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలంటూ మాస్టిన్‌లు ఆందోళన చేపట్టారు. కాళ్లలో భూ రికార్డుల ఆన్‌లైన్ చేయడంలో అవకతవకలపై తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులు ధర్నా నిర్వహించారు.

ఉపాధ్యాయుల ధర్నా

ఏలూరు అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, ఉపాధ్యాయుల బదిలీ విధానాలపై అసంబద్ధతకు నిరసనగా యూటీఎఫ్ పిలుపు మేరకు డీఈవో కార్యాలయం వద్ద సోమవారం టీచర్లు, సంఘ నాయకులు ధర్నా నిర్వహించారు. ఏపీ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్ల సంఘం (జేఏసీ) ఉమ్మడి జిల్లా ఛైర్మన్ సీహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాల విద్యలో ఒక ముఖ్యఅధికారి వైఖరిని ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి గమనించాలన్నారు. ఇంత వరకు ఉద్యోగులకు పీఆర్సీ ఆర్థిక బకాయిలు, డీఏలు ఇవ్వలేదని, 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించ లేదని విమర్శించారు. త్వరలో ఉద్యమ కార్యాచరణ ప్రకటించనున్నట్లు వెల్లడించారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ జీవో 117 రద్దుచేయడం లేదా ప్రత్యామ్నాయ జీవోను విడుదల చేయలేదన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 1:20, ఉన్నత పాఠశాలల్లో 1:45 నిష్పత్తిలో ఉపాధ్యాయ పోస్టులను కేటాయించాలని, ప్రాథమికోన్నత పాఠశాలలను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి మనోహర్ కుమార్ మాట్లాడుతూ టీచర్ల ఆందోళనపై ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 25న అమరావతిలో విద్యాశాఖ రాష్ట్ర కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. అనంతరం డీఈవో వెంకటలక్ష్మమ్మకు వినతిపత్రాన్ని అందజేశారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, జేఏసీ ఉమ్మడి జిల్లా సెక్రటరీ జనరల్ రామారావు, యూటీఎఫ్ నాయకులు సుభాషిణి, షేక్ ముస్తఫాఅలీ, వెంకటేశ్వరరావు, రంగమోహన్, ఉపాధ్యాయులు, సీఐటీయూ నాయకులు లింగరాజు, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి లెనిన్ పాల్గొన్నారు.

వంటావార్పుతో సీహెచ్‌వోల నిరసన

ఏలూరు రూరల్: కమ్యూనిటీ హెల్త్ అధికారులు (సీహెచ్‌వోలు) న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిర్వహిస్తున్న ఆందోళన సోమవారం 15వ రోజుకు చేరింది. సమ్మె శిబిరం వద్ద వంటా వార్పు నిర్వహించి నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ సీహెచ్‌వోలుగా 6 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. జాతీయ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన పెంపుదలను అమలు చేయాలని, ఈపీఎఫ్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నిర్దిష్టమైన జాబ్‌చార్టులు అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్‌లు చెల్లించాలని డిమాండ్ చేశారు.

కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వండి

కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వండి మహాప్రభో అంటూ మండవల్లిలోని హిందూ మాస్టిన్ కులానికి చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 80 ఏళ్లుగా మండవల్లిలో మాస్టిన్ కులానికి చెందిన 100 కుటుంబాల వారు ఉన్నారన్నారు. జిల్లాల పునర్విభజన తరువాత కైకలూరు నియోజకవర్గం ఏలూరు జిల్లా పరిధిలోకి వచ్చిన నాటి నుంచి వారికి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బుద్దుల చంటి, బుద్దుల అస్మిత, ఎన్.రషిత, బి.వెంకటరమణ, ఎన్.తేజస్విని పాల్గొన్నారు.

భూ రికార్డుల్లో అవకతవకలు

కాళ్ళ, మే 12 (ఆంధ్రజ్యోతి): కాళ్ళ గ్రామంలో భూ రికార్డుల ఆన్‌లైన్ చేయడంలో అవకతవకలు జరిగాయని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. రైతులు మాట్లాడుతూ బ్రిటీష్ కాలంలో జరిగిన సర్వే ప్రకారం కాళ్ళ వ్యవసాయ భూముల విస్తీర్ణం సుమారు 3,862 ఎకరాలు అన్నారు. భూములను ఆన్‌లైన్ చేసిన సందర్భంలో రెవెన్యూ రికార్డులను తారుమారు చేశారని తహసీల్దార్ సుందర్ సింగ్‌కు వివరించారు. అనర్హులను 1బీ లో నమోదు చేయడం వల్ల అర్హులంతా రోడ్డున పడ్డామన్నారు. ఇటీవల భూ సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం పకడ్బందీగా రీ సర్వే చేయిస్తున్నప్పటికీ భూ సమస్యలపై ఫిర్యాదులు మరింత పెరిగాయన్నారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది సక్రమంగా పనిచేయడం లేదని అసహనం వ్యక్తం చేశారు. కాళ్ళ గ్రామంలో రీసర్వే జరిగి చాలా కాలమైనప్పటికీ గోప్యతను ఎందుకు పాటిస్తున్నారని ప్రశ్నించారు. ఒక్కొక్క రైతుకు ఎకరాకు 2 సెంట్ల నుంచి 40 సెంట్లు భూమి వ్యత్యాసం చూపిస్తున్నారని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేక బృందంతో రెవెన్యూ రికార్డులను ఆడిట్ చేయించి గ్రామంలోని భూ సమస్యలు పరిష్కరించాలన్నారు.


మంటలు అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

భీమవరం క్రైం, మే 12 (ఆంధ్రజ్యోతి): పార్క్ చేసిన కారు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. భీమవరం అగ్నిమాపక అధికారి సీహెచ్.సూర్యప్రకాశరావు తెలిపిన వివరాల ప్రకారం పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన గ్రంధి నాగ వెంకటలక్ష్మీ కృష్ణప్రసాద్ తన కారులో భీమవరం ఆసుపత్రికి వచ్చారు. పార్క్ చేసిన కారు నుంచి కొంతసేపటికి ఇంజన్ నుంచి మంటలు వ్యాపించాయి. టైర్లు, ఇంజన్ కూడా కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు అక్కడికి చేరుకుని మంటలు అదుపు చేశారు.

ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

పాలకోడేరు, మే 12 (ఆంధ్రజ్యోతి): భీమవరం శివారు గొల్లలకోడేరులో ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ కెకృష్ణారావు అసభ్యంగా ప్రవర్తించారని బాలిక తండ్రి సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చిన అమిరం గ్రామానికి చెందిన వీర్రాజు కుమార్తె ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ప్లస్ 2 చదువుతోంది. స్కూల్‌లో ప్రిన్సిపాల్ కృష్ణారావు తమ కుమార్తెతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ మానసిక వేదనకు గురిచేశాడని, తన మాట వినకపోతే ఫెయిల్ చేస్తానంటూ బెదిరించాడని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపాల్ హోదాలో ఉన్న కృష్ణారావు తమ కుమార్తెను ఛాంబర్‌లోకి పిలిపించి తప్పుగా ప్రవర్తించేవాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ కావడంతో ఫెయిల్ చేస్తాడేమోననే భయంతో తమ కుమార్తె బయటకు చెప్పకుండా లోలోనే బాధపడిందన్నారు. ధైర్యం చేసి తనకు చెప్పడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపాల్ కృష్ణారావుపై కఠిన చర్యలు తీసుకోవాలని రాయపురెడ్డి వీర్రాజు ఫిర్యాదులో పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఏలూరు క్రైం, మే 12 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి బాధభరించలేక పురుగుమందు తాగిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. పెదవేగి మండలం ప్రకాష్ నగర్‌లోని ఆర్‌సీఎం సంస్థ వద్ద వల్లి ఏసమ్మ (45) తన భర్తతో కాపలా ఉంటుంది. కడుపునొప్పి భరించలేక సోమవారం పురుగు మందు తాగింది. ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా సోమవారం రాత్రి మృతి చెందింది. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేశారు.

మొదటి భర్తపై రెండో భర్త హత్యాయత్నం

తాడేపల్లిగూడెం రూరల్, మే12 (ఆంధ్రజ్యోతి): తన భార్యపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్నాడని రెండో భర్త మొదటి భర్తపై హత్యాయత్నం చేసిన ఘటన తాడేపల్లిగూడెంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కారు డ్రైవర్ సిర్రా నాగేశ్వరరావు, భార్య రామతులసి మనస్పర్థలతో విడాకులు తీసుకున్నారు. ఆమె బాదంపూడి డేవిడ్‌ను రెండో పెళ్లి చేసుకుంది. నాగేశ్వరరావు ఆమెపై తప్పుడు మాటలు ప్రచారం చేస్తున్నాడని డేవిడ్ గతంలో గొడవ పడ్డాడు. మసీదు సెంటర్ వద్ద నాగేశ్వరరావుపై డేవిడ్ కొడవలితో దాడి చేశాడు. గాయాలైన నాగేశ్వరరావును తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

మద్యం మత్తులో యువకుడి హత్య


అరవింద్ మృతదేహం, పరిశీలిస్తున్న పోలీసులు

కాళ్ళ, మే 12 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో జరిగిన గొడవలో యువకుడు హత్యకు గురైన సంఘటన కాళ్ళ మండలం ఎల్ఎన్ పురంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు జిల్లా కోమటిలంకకు చెందిన చెన్నకేశవ అరవింద్ (22), ప్రత్తికోళ్లలంకకు చెందిన బండి జాన్ ఏసు బంధువులు. కొంత కాలం క్రితం ఎల్ఎన్ పురంలోని చెరువుల వద్దకు జీవనోపాధి నిమిత్తం వచ్చారు. వారు పనిచేసే చెరువుల వద్ద కిరణ్ అనే వ్యక్తి పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి ముగ్గురూ చెరువు వద్దకు మద్యం తెచ్చుకున్నారు. తర్వాత బంధువులైన జాన్ ఏసు, అరవింద్ గొడవపడ్డారు. అరవింద్ పక్కనే ఉన్న వస్తువుతో జాన్ ఏసుపై దాడి చేయడానికి ప్రయత్నించాడు. వెంటనే జాన్ ఏసు మేత బస్తాలపై ఉన్న చాకుతో అరవింద్ ఛాతీపై పొడిచాడు. తీవ్ర రక్తస్రావంతో పడిపోయిన అరవింద్‌ను పక్కనే ఉన్న కిరణ్ వేరొకరి సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు, ఎస్ఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దీనిపై మృతుడు అరవింద్ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలికతో అసభ్య ప్రవర్తన కేసులో

వృద్ధుడికి 20 ఏళ్ల జైలు

భీమవరం క్రైం, మే 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఆడుకుంటున్న 12 ఏళ్ల బాలికను 73 ఏళ్ల వృద్ధుడు బలవంతంగా ఇంట్లోకి లాక్కువెళ్లి నోటిలో గుడ్డలు కుక్కి అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ కేసులో వృద్ధుడికి పోక్సో కోర్టు 20 ఏళ్ల జైలుశిక్ష విధించింది. దీనికి సంబంధించి వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం భీమవరం పట్టణానికి చెందిన బాలిక (12) రోడ్డుపై ఆడుకుంటుంది. వారి బంధువు అయిన రామభద్ర బాడవకు చెందిన బి.సత్యనారాయణ (73) ఆమెకు మాయమాటలు చెప్పి బలవంతంగా ఇంట్లోకి తీసుకువెళ్లాడు. నోట్లో గుడ్డలు కుక్కి అసభ్యంగా ప్రవర్తించడంతో ఇంటికి వెళ్లి తల్లికి చెప్పింది. దీంతో తల్లి 2024 జనవరి 21న వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేశారు. మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ పైడేశ్వరరావు దర్యాప్తు జరిపి ఛార్జిషీట్ ఫైల్ చేశారు. ఈ కేసును సోమవారం విచారణ చేసిన భీమవరం పోక్సో కోర్టు న్యాయాధికారి బి.లక్ష్మీనారాయణ నిందితుడైన భరత సత్యనారాయణకు 20 సంవత్సరాల జైలుశిక్ష విధించారు. బాధితురాలికి లక్ష రూపాయల పరిహారం ఇవ్వవలసినదిగా లీగల్ కౌన్సిల్‌కు సిఫార్సు చేసినట్లు సీఐ తెలిపారు. అడిషనల్ పీపీ బ్రహ్మయ్య వాదించారు. హెడ్ కానిస్టేబుల్ ఎస్.రమేష్‌బాబు సహకరించారు.



మొగల్తూరు దారితిప్ప వద్ద రహదారిపై దుర్గాప్రసాద్ మృతదేహం, కుక్కునూరు మండలంలో యువకుడి మృతదేహం

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

మొగల్తూరు, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని దారితిప్ప 216 జాతీయ రహదారి మలుపు వద్ద సోమవారం చేపలలోడు వ్యాన్ బైక్‌ను ఢీకొనడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మొగల్తూరు ఎస్ఐ వై.నాగలక్ష్మీ తెలిపిన వివరాల ప్రకారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేదిలో నివాసం ఉంటున్న రామాని దుర్గా ప్రసాద్ (32) అత్తవారి ఇంటికి కలవపూడి వద్ద మోడి గ్రామానికి వెళుతున్నాడు. జాతీయ రహదారి మలుపు వద్ద చేపలలోడు వ్యాన్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. అతడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతుడు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నాగలక్ష్మీ తెలిపారు.

ద్విచక్ర వాహనంపైనుంచి పడిపోయి..

కుక్కునూరు: బంజరంగూడెం మలుపు వద్ద ద్విచక్ర వాహనంపై నుంచి ఇద్దరు పడిపోయారు. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కి ఫోన్ చేయడంతో ఫీడర్ అంబులెన్స్‌లో అమరవరం ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. కుక్కునూరు ఎస్సై రామకృష్ణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడు, గాయపడిన వ్యక్తి ఇద్దరూ చత్తీస్‌గఢ్ ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించారు.

గ్రంథపఠనం అభివృద్ధికి చిహ్నం : అరుణ్ కుమార్

పెదవేగి, మే 12(ఆంధ్రజ్యోతి) : గ్రంథపఠనం అభివృద్ధికి చిహ్నమని పెదవేగి శాఖా గ్రంథాలయ గ్రంథపాలకుడు తోట అరుణ్‌కుమార్ అన్నారు.పెదవేగిలో శాఖా గ్రంథాలయంలో సోమవారం జరిగిన వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు చేతిరాత పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు చేతిరాత పరీక్షా పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలన్నారు. విజ్ఞానదాయకమైన పుస్తక పఠనంతో కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు.

గుబ్బల మంగమ్మను దర్శించుకున్న తెలంగాణ ఎంపీ, ఎమ్మెల్యే



బుట్టాయగూడెం : గుబ్బల మంగమ్మను సోమవారం ఖమ్మం జిల్లా ఎంపీ రామసహాయం రఘురామరెడ్డి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణలు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద అభివృదద్ధి పనులను పరిశీలించిన నాయకులు కమిటీవారిని అభినందించారు.

ఉపాధి బకాయిలు చెల్లించాలంటూ కలెక్టర్‌కు వినతి

ఏలూరు రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న ఏలూరు జిల్లాలోని కూలీలకు బకాయి పడిన సుమారు 45 కోట్ల రూపాయల బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సోమవారం కలెక్టర్ వెట్రి సెల్విని కలిసి వినతి పత్రం అందజేశారు. మార్చి 17 నుంచి మే 10వ తేదీ వరకు ఏలూరు జిల్లాలో ఉపాధి పనులు చేసిన కూలీలకు 45 కోట్ల రూపాయల కూలీ బకాయిలు చెల్లించాల్సి ఉందని సంఘ జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కుంచే వసంతరావు, జిల్లా ఉపాధ్యక్షులు గోలిమే బాల ఏసు వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బుగ్గన ప్రభాకర్, గుడే ఆశీర్వాదం, అరగెల యోహాన్, పెండ్లి భూషణం, యడ్లపల్లి రమేశ్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాల దరఖాస్తు గడువు పెంచండి

ఏలూరు రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఇచ్చిన గడువును పొడిగించాలని కోరుతూ పలువురు ఎస్సీ నాయకులు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందడానికి ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవడానికి 10వ తేదీ ఆఖరని ప్రభుత్వం ప్రకటించిందని కానీ ఏడో తేదీ నుంచి పదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి సర్వర్ పనిచేయని కారణంగా చాలా మంది దరఖాస్తు చేసుకోలేకపోయారని మరో పది రోజులు గడువు పెంచాలని కోరారు. ఎస్సీ నాయకులు నేత రమేష్‌బాబు, దాసరి నాగేంద్రకుమార్, మెండెం సంతోష్‌కుమార్, అంబేద్కర్, తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట సీఐ తీరుపై వైసీపీ అభ్యంతరం

ఏలూరు రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి విడుదల రజని అనుచరుడిని అదుపులోకి తీసుకునే క్రమంలో చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బ నాయుడి తీరును వైసీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు ఖండించారు. సోమవారం వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రజని పీఏను అరెస్టు చేసే క్రమంలో దురుసుగా ప్రవర్తించడం సరికాదన్నారు. అరెస్టుకు కారణం చెప్పాలని అడిగితే కారు నుంచి బయటకు లాగడం దుర్మార్గమన్నారు. ఒక బీసీ మహిళపై ఇంత దారుణంగా ప్రవర్తించడం చరిత్రలో ఎక్కడా చూడలేదన్నారు. సమావేశంలో మామిళ్ళపల్లి జయప్రకాశ్, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మద్దిపాటి శైలజ ఎంపికపై హర్షం

దెందులూరు, మే 12(ఆంధ్రజ్యోతి) : ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా దెందులూరుకు చెందిన మద్దిపాటి శైలజను ప్రభుత్వం నియమించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అమరావతి (జేఏసీ) ఉద్యమ సమయంలో శైలజ రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు మద్దతుగా పాదయాత్ర చేశారు. శైలజ నియామకం పట్ల పారిశ్రామికవేత్త మద్దిపాటి సీతారామ్మోహన్‌రావు, పోతినేని రమేష్‌బాబు, సినీ హీరో రామ్ తండ్రి పోతినేని మురళి, స్రవంతి మూవీస్ సంస్థల అధినేత పోతినేని రవి కిషోర్‌తో పాటు పలువురు శైలజ కుటుంబ సభ్యులు శైలజాకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ మహిళా కమిషన్ పదవికి వన్నె తెచ్చేలా బాధ్యతగా పని చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

చినవెంకన్న ఆలయంలో పల్లా పేరున పూజలు

ద్వారకాతిరుమల, మే 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస యాదవ్ పుట్టిన రోజును పురస్కరించుకుని చినవెంకన్న ఆలయ ప్రాంగణలో సోమవారం పూజలు చేశారు. టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కూరాకుల బుజ్జి యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ముందుగా ఆలయ తొలిమెట్టు వద్ద స్వామివారి పాదుకా మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు మద్దాల వెంకటేశ్వరరావు, కాట్రుబాల కృష్ణ, కొండారెడ్డి, మాగంటి మురళీ కృష్ణ పాల్గొన్నారు. మండలాధ్యక్షుడు లంకా సత్యానారాయణ నేతృత్వంలో మారంపల్లిలో పల్లా శ్రీనివాసరావు పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కేత గౌరేశ్వరరావు, సాయిల రమేష్, దేవరపల్లి హేమంత్, పి.ఆంజనేయులు, ఏపూరి కిషోర్, ఎం.బద్రి పాల్గొన్నారు.

ఆదివాసీల కోసం సోయం గంగులు కృషి

బుట్టాయగూడెం, మే 12(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల హక్కుల సాధనకై సోయం గంగులు చేసిన పోరాటాలు మరువలేనివని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా తెల్లం రామకృష్ణ అన్నారు. సోమవారం బుట్టాయగూడెంలో సోయం గంగులు 74వ వర్ధంతిని నిర్వహించారు. ఈ మరకు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పోడుభూముల రక్షణకు, దోపిడికి వ్యతిరేకంగా పోరాటాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు పోలోజు నాగేశ్వరరావు, బుల్లెమ్మ, శ్రీనివాస్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

పట్టిసీమ వీరేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



పోలవరం, మే 12(ఆంధ్రజ్యోతి): పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలోని భద్రకాళీ, లక్ష్మీగణపతి, కాలభైరవుడు, నవగ్రహాలకు, ఆలయ ఆవరణ వెలుపల ఉన్న క్షేత్రపాలకుడు భావన్నారాయణ స్వామి, సీతారామచంద్ర స్వామి, ఆంజనేయ స్వామి, సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయాలను భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. గుడ్డిగూడెం నుంచి 15 మంది భక్తులు కాలినడకన వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. జనసేన పార్టీ మండల కన్వీనర్ గునపర్తి చిన్ని ఆధ్వర్యంలో సైనికుల కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ సిబ్బంది వెంకట్రాజు భక్తులకు పులిహోర ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేశారు. ఆలయ అర్చక బ్రాహ్మణులు ర్యాలి చంద్రశేఖర్, ప్రశాంత్, సుబ్రహ్మణ్యం, అభిరామ్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పోలవరంలో ఈదురు గాలులు వడగండ్ల వర్షం



పోలవరం, మే 12(ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసింది. ఈదురు గాలులకు ఏటిగట్టు సెంటర్‌లో ఫ్లెక్సీల బోర్డులు ఎగిరిపోయాయి. తహసీల్దారు కార్యాలయానికి వెళ్ళే మార్గంలో రోడ్డుపై చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. వర్షపునీరు వెళ్లే మార్గం లేక పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రం వద్ద రోడ్డుపై నిలిచిపోయింది. పట్టిసీమ, కొత్తపట్టిసీమ, ఇటుకలకోట, ప్రగడపల్లి, ఎల్.ఎం.డి. పేట గ్రామాల్లో పొలాల్లో ఉన్న మొక్కజొన్న, వరి పంటలు తడిచిపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. మరికొంత మంది రైతులు బరకాలు కప్పి తమ పంటలను ఒబ్బిడి చేసుకున్నారు.

జిల్లా జైలు సందర్శనకు ముగ్గురికి అనుమతి

ఏలూరు క్రైం, మే 12(ఆంధ్రజ్యోతి) : జిల్లా జైలులో ఖైదీల సంక్షేమాన్ని, వారిలో సత్‌ప్రవర్తన కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏలూరునకు చెందిన ముగ్గురికి జిల్లా జైలు సందర్శించడానికి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు సీఆర్ఆర్ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ ఎల్.వెంకటేశ్వరరావు, ఏలూరులోని రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి కూన కృష్ణారావు, ఏలూరులోని సోషల్ వర్కర్ హోమియోపతి వైద్యురాలు డాక్టర్ అబ్బూరి అరుణలు నాన్ అఫీషియల్ కేటగిరిలో అనుమతినిస్తూ హోమ్ శాఖ ప్రధాన కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

ఉపాధి కార్మికుల సమ్మెను జయప్రదం చేయండి

పెదవేగి, మే 12(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ కూలీల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పి.ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పెదవేగి, రాయన్నపాలెం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పథకం పనులను సోమవారం సందర్శించి, కూలీల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీ, వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు అస్కర్ అప్పలస్వామి, చంటి, శౌరి పాల్గొన్నారు.

పట్టించుకునే నాథుడే కరువు..

జంగారెడ్డిగూడెం నాల్గవ వార్డులో తిష్టవేసిన సమస్యలు - పరిష్కారం చూపాలంటూ ప్రజల విజ్ఞప్తి

వార్డు వాచ్



రోడ్డు పక్కన చెత్తకు నిప్పు పెట్టడంతో వస్తున్న పొగ

జంగారెడ్డిగూడెం, మే 12(ఆంధ్రజ్యోతి) : ఏళ్ళు గడుస్తున్నా పట్టణంలోని నాల్గవ వార్డు ఇందిరా నగర్ సమస్యలు పట్టించుకునే నాథుడే కరువయ్యారు. జంగారెడ్డిగూడెం నుంచి రాజమండ్రి, తాడేపల్లిగూడెం వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకుని ఉండే ఇందిరానగర్ ప్రధాన డ్రెయినేజీ చెత్త, పిచ్చి మొక్కలతో అస్తవ్యస్తంగా తయారైంది. కనీసం డ్రెయినేజీ పూడిక కూడా తీయకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో రోడ్డు పక్క అపరిశుభ్రంగా తయారైంది. ఊరిలోని డ్రెయినేజీ మురుగంతా కింది ప్రాంతమైన ఇందిరా నగర్ డ్రెయినేజీలోకి చేరుతోంది. ఈ డ్రైనేజీ రోడ్డుకు సమాంతరంగా ఉండడంతో కొద్దిపాటి వర్షానికే డ్రెయినేజీ పొంగి ఆ నీరంతా ఇందిరా నగర్ లోని ఎనిమిది రోడ్లమీదికి వెళ్లడంతో తమ ఇళ్ళ ముందు మురుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాన రహదారి పక్కనే చెత్త...

కొవ్వూరు రోడ్డులో శ్మశాన వాటిక ఎదురుగా చిన్న పాటి డంపింగ్ యార్డు పెట్టారు. చుట్టు పక్కల ఉన్న వార్డుల చెత్తంతా సేకరించి ఆ రోడ్డు పక్కన కుప్పలుగా పెట్టారు. అనంతరం ఆ చెత్తకు నిప్పు పెట్టడంతో రోడ్డంతా పొగకమ్మేస్తోంది. రోడ్డు కనిపించక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.అధికారులు స్పందించి రోడ్డు పక్క నుంచి చెత్తను వేరే చోటికి తరలించాలని ప్రజలు కోరుతున్నారు.





కొవ్వూరు రోడ్డులో పేరుకున్న చెత్త, అధ్వానంగా డ్రెయినేజీ

ప్రధాన డ్రెయినేజీ సమస్య పరిష్కరిస్తాం..

మున్సిపల్ కౌన్సిల్లో ప్రధాన డ్రెయినేజీ గురించి అనేక సార్లు చర్చించాం. సమస్యను ఎమ్మెల్యే రోషన్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి దృష్టికి తీసుకెళ్లి త్వరలో పనులు పూర్తయ్యేలా చూస్తాం. ఈ డ్రెయినేజీ సమస్య దీర్ఘకాలికంగా ఉంది. వర్షాకాలంలో ఇందిరా నగర్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. త్వరగా డ్రెయిన్ నిర్మాణానికి కృషి చేస్తా.

వలవల తాతాజీ, నాల్గవ వార్డు కౌన్సిలర్

చెత్త తొలగింపునకు చర్యలు చేపడతాం

ఇందిరా నగర్ కాలనీలో ప్రధానంగా మెయిన్ డ్రెయినేజీ సమస్య ఉంది. ప్రధాన డ్రెయిన్ నిర్మాణానికి రూ.35 లక్షలు ఖర్చవుతుంది. మొదటి విడతగా సుమారు రూ.10 లక్షలు టెక్నికల్ మంజూరు కోసం పంపాం. అనుమతి రాగానే టెండరు పిలిచి పనులు ప్రారంభిస్తాం. చెత్తను డస్ట్‌బిన్‌లలో మాత్రమే వేయాలి. చెత్తకు నిప్పు పెట్టకుండా తొలగించేలా చర్యలు చేపడతాం..

కె.వి.రమణ, మున్సిపల్ కమిషనర్, జంగారెడ్డిగూడెం



పెద్దిబోయిన శివప్రసాద్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే చంటి

అందరికీ అండగా ఉంటా : ఎమ్మెల్యే చంటి

ఏలూరు రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ బలోపేతానికి విశేష కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటానని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన పార్టీ నగరాధ్యక్షులు పెద్దిబోయిన శివప్రసాద్‌కు ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ పదవి దక్కడం సంతోషదాయమన్నారు. పవర్‌పేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం పెద్దిబోయిన శివప్రసాద్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ వర్కర్స్ సంఘం ఎంపిక

పెదపాడు, మే 12(ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ వర్కర్స్ ఏఐటీయూసీ నూతన కమిటీని ఎన్నుకున్నట్టు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాస్‌డాంగే, జిల్లా నాయకులు కిశోర్‌లు తెలిపారు. మండలాధ్యక్షుడిగా ఒంపుగడ్డ ఏసుపాదం, ఉపాధ్యక్షుడిగా పైడి రవిచంద్ర కుమార్, పిట్టా జార్జి, కార్యదర్శులుగా నరహరశెట్టి వెంకటేశ్వరరావు, నత్తా ప్రసాద్, సహాయ కార్యదర్శులుగా తమ్మిరాజు, జోజి, కమిటీ సభ్యులుగా ఎల్లయ్య, బాలస్వామి, నీలమ్మ, దుర్గలు ఎన్నికయ్యారు. కమిటీకి గౌరవాధ్యక్షులుగా ఆర్.శ్రీనివాసడాంగే, గౌరవ సలహాదారులుగా పి.కిశోర్‌లను ఎన్నుకున్నారు.

ఉపాధి వేతన బకాయిలు చెల్లించాలి

ఏలూరు రూరల్ /కుక్కునూరు,మే 12(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల వేతన బకాయిలు వెంటనే విడుదల చెయ్యాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు డ్వామా పీడీ వెంకట సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. పిల్లి రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రదేశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల20న దేశవ్యాప్తంగా ఉపాధి పనులు నిర్వహించకుండా సహకరించాలన్నారు. కుక్కునూరు మండలం బర్లమడుగు గ్రామంలో ఉపాధి హామీ పనులను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్య దర్శి కె.బాబూరావు, వెంకటేశ్వర్లు, రమేష్, వెంకటయ్య పరిశీలించి సమస్యలు తెలుసుకున్నారు.

ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

ఉంగుటూరు, మే 12(ఆంధ్రజ్యోతి) :బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రాచూరు ఆయకట్టు చేపల చెరువుల వద్ద కాపలా ఉంటున్న ఓ కుంబానికి చెందిన బాలికపై పక్క చెరువుపై కాపలా ఉంటున్న వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఫిర్యాదు మేరకు సోమవారం ఏలూరు ఎస్పీ కిశోర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్పీ వెంట నిడమర్రు సీఐ సుభాశ్, చేబ్రోలు ఎస్.ఐ. సూర్య భగవాన్‌లు ఉన్నారు. ఈ మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్.ఐ. తెలిపారు.

విద్యుత్ సమస్యలు రాకుండా చూడండి

జీలుగుమిల్లి, మే 12(ఆంధ్రజ్యోతి) : వేసవి నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఇటీవల బాధ్యతలు చేపట్టిన జీలుగుమిల్లి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రమేష్ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఏఈలు నాగశేషు, మురళీ, జేఈలు కన్నపరాజు, గోల్ నాయక్ లైన్‌మెన్‌లు ఉన్నారు.

దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

జీలుగుమిల్లి, మే 12(ఆంధ్రజ్యోతి) : పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని జంగారెడ్డిగూడెం ఆర్డీవో రమణ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. జీలుగుమిల్లి తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను పరిశీలించి అనంతరం తహసీల్దారు ఉదయ్ భాస్కర్ నాయక్‌తో చర్చించారు.

ఆసుపత్రిలో నర్సుల దినోత్సవం

చింతలపూడి, మే 12(ఆంధ్రజ్యోతి) :స్థానిక ఏరియా ఆసుపత్రిలో నర్సుల దినోత్సవం ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యుడు కోండ్రు దేవ, జి.భారతి మాట్లాడుతూ వైద్యు లిచ్చే మందులు ఎంత ముఖ్యమో నర్సుల సేవలు కూడా అంతే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ నారాయణరావు, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ మహర్షి, దివ్య పాల్గొన్నారు.

సోమవరప్పాడు టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక

దెందులూరు, మే 12(ఆంధ్రజ్యోతి): సోమవరప్పాడు టీడీపీ గ్రామ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామాధ్యక్షుడిగా కర్రి రంగారావు, జనరల్ సెక్రటరీగా చల్లపల్లి లోకేశ్ కుమార్, ఉపాధ్యక్షులు చొదిమేళ్ల జయరాజు, ట్రెజరర్‌గా పండ్రంకి సూర్యనారాయణ,ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా బొమ్మగంటి సురేశ్, సైనా కొండ, వెంపల వాసు, కార్యదర్శులు ములకాల సోమరాజు, గంగుల సత్యనారాయణ, యడ్ల యేసురత్నంను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో దెందులూరు మండలాధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్(మిల్లుబాబు), మోతుకూరి నాని, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాగంటి సురేంద్రనాథ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాబ్, డీసీసీబీ చైర్మన్‌గా ఎంపికైన గన్నికి అభినందనలు

భీమడోలు/జంగారెడ్డిగూడెం/లింగపాలెం, మే 12 (ఆంధ్రజ్యోతి) : ఆప్కాబ్, డీసీసీబీ చైర్మన్‌గా ఎంపికైన గన్ని వీరాంజనేయులును పలువురు నాయకులు అభినందించారు. ఆప్కాబ్ ఎండీ త్రినాథ్‌రెడ్డి ఏలూరు ఆప్కాబ్ సిబ్బంది గన్నిని కలిసి అభినందనలు తెలిపారు. అలాగే జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున కూటమి నేతలు, బీజేపీ శ్రేణులు తరలి వచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. గన్నికి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు. ఆయన వెంట జంగారెడ్డిగూడెం టీడీపీ నాయకులు పెనుమర్తి రామకుమార్, రావూరి కృష్ణ, సాయిల సత్యనారాయణ, తూటిగుంట రాము, నాయుడు శ్రీనివాస్, లింగపాలెం మండల నాయకులు గరిమళ్ల చలపతిరావు, గుత్తా సత్య సాయి వరప్రసాద్, జగ్గవరపు ముత్తారెడ్డి, గారపాటి బుజ్జయ్య, తదితరులు ఉన్నారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆప్కాబ్ ఎండీ త్రినాథ్ రెడ్డి

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, మే 12(ఆంధ్రజ్యోతి) : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని పెదవేగి సీఐ వెంకటేశ్వరరావు వీరమ్మకుంట గ్రామం వద్ద సోమవారం స్వాధీనం చేసుకున్నారు. చెరువులో మేతగా వేసేందుకు సుమారు 10 వేల కిలోల చికెన్ వ్యర్థాలను ఐషర్ వాహనంలో తరలిస్తుండగా తనిఖీ నిర్వహించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహన యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హెచ్‌ఐవీపై అవగాహనకు కళాజాత

ఏలూరు అర్బన్, మే 12(ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ నియంత్రణలో భాగంగా సోమవారం జానపద కళాజాత(వీధినాటిక)బృందాలతో అవగాహన కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో మాలిని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ హెచ్‌ఐవీ/ఎయిడ్స్ వైరస్ పట్ల ప్రజలంతా అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ నియంత్రణాధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలోని 20ముఖ్యమైన ప్రాంతాల్లో రెండు కళాజాత బృందాలతో వీధి నాటికలు ప్రదర్శించి హెచ్‌ఐవీపై అవగాహన కల్పిస్తామన్నారు. క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ బాలాజీ, డాప్‌క్యూ జిల్లా సూపర్‌వైజర్ హరనాథ్, వైద్యాధికారి బ్యూలా, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

ఏలూరు క్రైం, మే 12(ఆంధ్రజ్యోతి):ఇంటి నుంచి ఈ నెల 11న బయటకు వెళ్లిన ఒక యువకుడు తిరిగిరాకపోవడంతో బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏలూరు వన్‌టౌన్‌లోని పెద్దింటివారి వీధికి చెందిన గేదెల ఈశ్వరరావు(32) పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాడు. ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సైనికుల త్యాగాలు మరువలేం..

ఏలూరు రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి) : దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన సైనికుల సేవలను మరువలేమని ఏలూరు తహసీల్దార్ శేషగిరి పేర్కొన్నారు. శనివారపుపేటకు చెందిన సైనికుడు బయ్యారపు ప్రసాద్ 2003 మే 12న కాశ్మీర్లో ఉగ్రదాడిలో అమరుడయ్యాడు. మంగళవారం శనివారం పేటలో ఆయన నివాసం వద్ద వర్ధంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీను నాయక్ ప్రసాద్ సతీమణి స్వర్ణలత, సీఆర్పీఎఫ్, పోలీసులు పాల్గొన్నారు.

మాతృ మూర్తులకు ఘనంగా సన్మానం

జంగారెడ్డిగూడెం, మే 12(ఆంధ్రజ్యోతి) : రోటరీ ఇన్నర్ వీల్ క్లబ్ గోల్డ్ అధ్యక్షురాలు నాగసూరి మాధురి ఆధ్వర్యంలో సోమవారం మాతృమూర్తులకు పాదాభివందనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ మాతృమూర్తులకు పాదాభివందనం చేశారు. అనంతరం దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ముందుగా ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన సైనికులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రోటరీ ఇన్నర్ వీల్ క్లబ్ గోల్డ్ కార్యదర్శి పద్మజ్యోతి, వెంకటలక్ష్మి, నూలు జ్యోతి సాయిలక్ష్మి, హరిప్రియ పాల్గొన్నారు.

ఘనంగా స్వామివార్ల కల్యాణోత్సవం

పెదవేగి, మే 12(ఆంధ్రజ్యోతి): రాయన్నపాలెంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో దేవేరుల కల్యాణోత్సవం సోమవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు శేషాచార్యులు కల్యాణవేడుకను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి కల్యాణోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను సాదరంగా ఆహ్వానించగా వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో శాంతిభద్రతలే లక్ష్యం : సీఐ



పల్లెనిద్రలో భాగంగా ప్రజలతో సీఐ రాజశేఖర్

లింగపాలెం, మే 12(ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో శాంతి భద్రతలను కాపాడటంతో పాటు పోలీసు సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడ మే తమ లక్ష్యమని సీఐ రాజశేఖర్ అన్నారు. మం డలంలో మఠంగూడెం గ్రామంలో ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్నతో కలిసి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు ప్రజా ఆరోగ్యానికి హానికరమని ప్రజలు డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలకు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల నివారణకు గ్రామాల్లో ఎవరైనా మత్తుపదార్థాలు, గంజాయి, డ్రగ్స్ కలిగి ఉంటే 1972 నంబర్‌కు, సైబర్‌నేరాలకు గురైతే 1930 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో ప్రజలు కలిసిమెలిసి ఉండాలన్నారు అత్యవసర పరిస్థితులు ఎదురైతే 112 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రజలకు సామాజికభద్రత, నేరాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





మాగంటి నారాయణ ప్రసాద్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

దెందులూరు మండలాధ్యక్షుడిగా మాగంటికే ఛాన్స్

దెందులూరు, మే 12(ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండలాధ్యక్షుడిగా మూడవసారి గోపన్నపాలెం గ్రామానికి చెందిన మాగంటి నారాయణ ప్రసాద్(మిల్లుబాబు)కే ఛాన్స్ దక్కింది. మండల కార్యదర్శిగా, వైస్ ఎంపీపీగా పని చేసిన చల్లచింతలపూడి గ్రామానికి చెందిన నాగనబోయిన సత్యనారాయణను ముడవసారి పార్టీ మండల కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఏనుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పోతునూరు మాజీ ఎంపీటీసీ తలారి ధన్యకుమార్, కోశాధికారిగా గద్దే అమరేశ్వరరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దెందులూరు పార్టీ కార్యాలయంలో మండల పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు ఇప్పిలి వెంకటేశ్వరావు, వి.ప్రభాకర్, గారపాటి కొండయ్య చౌదరి, మోతుకూరి నాని, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి) : చాటపర్రు సెక్షన్, గుడివాకలంక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో కొత్త లైన్‌పనుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ అంబేడ్కర్ తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1:30 నిమిషాల వరకు పైడిచింతపాడు, కొక్కిరాయిలంక గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

14 నుంచి 16 వరకు...

పెదవేగి : పెదవేగి మండలం జానంపేట విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని జానంపేట, జగన్నాథపురం, బి.సింగవరం, ముత్తనవీడు గ్రామాల్లో ఈ నెల 14వ తేదీ నుంచి 16వ తేదీ శుక్రవారం వరకు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు అంబేడ్కర్ తెలిపారు.

సారా కేసులో ఇద్దరికి రిమాండ్

జంగారెడ్డిగూడెం, మే 12(ఆంధ్రజ్యోతి) : సారా విక్రయించినా, కలిగి ఉన్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు హెచ్చరించారు. సోమవారం పంగిడిగూడెంలో వీరవల్లి శ్రీనివాసరావు నుంచి 5 లీటర్ల సారా, పట్టణంలోని బాలాజీ నగర్ లో వెలివల కనకరాజు నుంచి 5లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా ఇద్దరికీ రిమాండ్ విధించినట్టు సీఐ శ్రీనుబాబు తెలిపారు.

సారా విక్రయిస్తూ ఒకరి అరెస్టు..

టి.నర్సాపురం : సారా విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్ తెలిపారు. వల్లంపట్ల గ్రామంలో సారా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడి చేసి ఒకరిని అదుపులోకి తీసుకోగా మరొకరు పరారీలో ఉన్నట్టు తెలిపారు.వీరి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

చట్టప్రకారం అడ్మిషన్లు జరగాలి

టి.నర్సాపురం, మే 12(ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు పాఠశాలల్లో విద్యాహక్కుచట్టం ప్రకారం అడిష్మన్లు జరగాలని బొర్రంపాలెం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త గుండే పాండురంగ సోమవారం డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న ఫీజు వివరాలను నోటీస్ బోర్డులో పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. టీచర్లను నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను నియమించి వారి వివరాలు, విద్యార్హత, వారికిచ్చే వేతనాల వివరాలు నోటీస్ బోర్డులో పెట్టాలన్నారు. విద్యాహక్కు చట్టప్రకారం ప్రైవేటు యాజమాన్యం 25శాతం సీట్లను ఎస్సీఎస్టీ, వికలాంగ, మైనార్టీలకు కేటాయించాలని పాఠశాల యాజమాన్యాలు నోటు పుస్తకాలు, యూనిఫాం అమ్మ రాదని విద్యార్థుల ఫీజుల వివరాలు ఆన్‌లైన్‌లో ఉంచాలన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

టి.నర్సాపురం, మే12(ఆంధ్రజ్యోతి): రైతులకు 50శాతం రాయతీపై పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారిణి పి.సుమలత సోమవారం తెలిపారు. మండలంలో రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జనుము 180క్వింటాళ్లు, జీలుగ-20, పిల్లిపెసర-10 క్వింటాలు ఉన్నాయన్నారు. పీడీఎంఎస్ కిట్‌లు 175, రైతు కేంద్రం వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. కావల్సిన రైతులకు 50శాతం రాయితీపై అందిస్తామన్నారు. కావల్సిన రైతులు పొలంపాస్ బుక్, ఆధార్ కార్డు తీసుకుని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించాలన్నారు. మండలంలో 1600 మట్టి నమూనాలు, భూసార పరీక్షల నిమిత్తం సేకరించాల్సి ఉందన్నారు. భూసార పరీక్షలు చేయించుకునే రైతులు రైతు సేవా కేంద్రం వద్ద సంప్రదించాలని ఆమె తెలిపారు.

గన్నికి ఆప్కాబ్ చైర్మన్ పదవి పట్ల హర్షం

చాట్రాయి, మే 12(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులును ఆప్కాబ్ చైర్మన్‌గా నియమించటం పట్ల మండల టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, విజయ డెయిరీ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి అత్తులూరి శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బొట్టు వరలక్ష్మి, పలగాని దుర్గారావు, మండల నాయకులు మరిడి చిట్టిబాబు, బొట్టు లక్ష్మణరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ముగిసిన శ్రీవారి కల్యాణోత్సవాలు

కలిదిండి, మే 12 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో ఐదు రోజులుగా జరుగుతున్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. స్వామివారికి కుంకుమ పూజ, సహస్ర నామార్చన తదితర పూజలు నిర్వహించారు. ఈ నెల 15న అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ ఈవో కె.శ్రీనివాసు తెలిపారు.



అల్లూరులో సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

కన్నుల పండువగా సోమేశ్వరస్వామి కల్యాణం

ముదినేపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామంలోని పార్వతి సమేత సోమేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం స్వామివార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. దేవస్థానంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై స్వామివార్ల కల్యాణాన్ని పెదతుమ్మిడికి చెందిన సోమరాజుపల్లి ఈశ్వర శర్మ, దేవస్థానం అర్చకుడు ఐలూరి సుబ్బరాయ శర్మ నిర్వహించారు. కన్నుల పండువగా జరిగిన ఈ కళ్యాణాన్ని వందలాది మంది భక్తులు తిలకించి పూజలు జరిపారు. దేవస్థానం ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమేశ్వరరావు స్వామికి మహారుద్రాభిషేకం ఇతర పూజా కార్యక్రమాలు జరిగాయి. తెలుగు యువ తనియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు, టీడీపీ నాయకుడు దాసరి శ్రీను, దేవస్థానం మాజీ చైర్మన్ పెరుమాళ్ల రత్న కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జగన్నాథస్వామి రథం ప్రారంభానికి ముందు పూజలు

వైభవంగా జగన్నాథుని రథోత్సవం

ముదినేపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలో సుభద్ర బలరామ సహిత జగన్నాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. విచిత్ర వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనల మధ్య జగన్నాథస్వామి రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో స్వామివారికి ఇంటింటా మహిళలు పూజలు జరిపారు. అనంతరం అవనిగడ్డకు చెందిన జయశ్రీ విజయ నాట్య మండలి కళాకారులు నిర్వహించిన సత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

ఆటో బైక్ ఢీ - యువకుడి మృతి

ఇద్దరికి తీవ్ర గాయాలు



మృతి చెందిన ఆకాశ్‌బాబు

ముదినేపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి - బంటుమిల్లి ప్రధాన రహదారిలో సోమవారం సాయంత్రం ఉప్పరగూడెం గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను ఆటో ఢీ కొన్న సంఘటనలో ఒక యువకుడు చనిపోగా ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు అయ్యాయి. కొత్తపల్లి వైపు నుంచి ఉప్పరగూడెం వస్తున్న బైక్‌ను కొత్తపల్లి వైపు వెళ్తున్న ఆటో ఢీకొన్న ఈ సంఘటనలో ఆటో నుంచి కిందపడిపోగా ఏలూరు సమీపంలోని మానూరు గ్రామానికి తేరా ఆకాశ్‌బాబు (16) అనే యువకుడు తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఆకాష్‌బాబును గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. ఆటో డ్రైవర్ కర్షకదళితవాడకు చెందిన పీతల అశోక్‌కు, బైక్‌పై వస్తున్న ఉప్పరగూడెంకు చెందిన దావు శ్రీనివాసరావు తీవ్ర గాయాలకు గురయ్యారు. వెంటనే ఉప్పరగూడెం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు లచ్చిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు గుడివాడ ఆసుపత్రికి క్షతగాత్రులను తరలించారు. దీనిపై ఆకాష్‌బాబు తల్లి మానస ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్‌ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

సెలవులకు వచ్చి మృత్యువాత పడ్డాడు

పదవ తరగతి పరీక్షలు రాసి సెలవులకు మానూరు నుంచి ఆకాష్‌బాబు పెదగొన్నూరు శివారు కర్షకదళితవాడలోని తన పెద్దమ్మ ఇంటికి వచ్చాడు. ఆగ్రామంలో చేపల పట్టుబడులు పట్టేవారి వెంట తాను కూడా శింగరాయపాలెం సమీపంలోని పనికి వెళ్ళి ఆటోలో తిరిగి ఇంటికి వస్తుండగా ఈ దుర్ఘటనలో ఆకాష్‌బాబు ప్రాణాలు కోల్పోయాడు. సెలవులకు బంధువుల ఇంటికి వచ్చి ఆకాష్‌బాబు ప్రాణాలు కోల్పోవడంపై అటు మానూరులోనూ, ఇటు కర్షకదళితవాడలోనూ విషాద ఛాయలు అలముకున్నాయి.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

చాట్రాయి, మే 12(ఆంధ్రజ్యోతి): చాట్రాయి జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో సోమవారం ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. తొలి రోజు సంస్కృతం, తెలుగు పరీక్షలకు ఇద్దరు గైర్హాజరు అయ్యారు. చిన్నంపేట ప్రభుత్వ జూనియర్ కాలేజి, చాట్రాయి వికాస్ కాలేజీలో విద్యార్థులు మొదటి సంవత్సరం 74 మంది, ద్వితీయ సంవత్సరం ఐదుగురు పరీక్షలు రాసుతన్నారని ఎంఈవో వీఎస్‌వి బ్రహ్మచారి తెలిపారు.

ముదినేపల్లి: ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమ య్యాయి. తొలి రోజు జరిగిన పరీక్షలకు మొదటి సంవత్సరం విద్యార్థులు ఆరుగురు, రెండవ సంవత్సరం విద్యార్థులు 9 మంది హాజరు కావాల్సి ఉండగా ఇద్దరు గైర్హాజరైనట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ఓరుగంటి సత్యనారాయణమూర్తి తెలిపారు.



చనుబండలో అన్న సమారాధన

చాట్రాయి, మే 12(ఆంధ్రజ్యోతి): చనుబండ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి స్వామివారి కల్యాణం కన్నుల పండువగా జరగ్గా, సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని అన్న ప్రసాదం స్వీకరించారు.



పసుపు పూలు కనువిందు

కలిదిండిలో ప్రధాన రహదారి పక్కన ఉన్న చెట్టు పసుపు పూలు విరబూచింది. గుత్తులుగా పసుపు పూలు వేలాడుతూ కనువిందు చేస్తున్నాయి. యువత పసుపు పూలు చెట్టు వద్ద నిలబడి సెల్ఫీలు దిగుతున్నారు. ఇటీవల అకాల వర్షాలు కురవటంతో చెట్టు చిగురించి కొమ్మ కొమ్మకు గుత్తులుగా పసుపు పూలు వేలాడుతూ ఆహ్లాద పరుస్తున్నాయి.

- కలిదిండి

రోడ్డుపై పడిన చెట్టు

విస్సన్నపేట- వెలగలపల్లి రహదారిలో చాట్రాయి-పోలవరం గ్రామాల మధ్య సోమవారం చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడటంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎస్సై రామకృష్ణ, పోలీస్ సిబ్బంది ఎక్సకవేటర్‌తో చెట్టును తొలగించి ట్రాఫిక్ పునరుద్ధరించారు.

- చాట్రాయి



యూపీ పాఠశాలల స్థాయి తగ్గింపుపై వివరాలు కోరిన ఆర్జేడీ

ఆంధ్రజ్యోతి కథనంపై స్పందన

ముదినేపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ముదినేపల్లి మండలంలోని అప్పర్ ప్రైమరీ పాఠశాలలను బే సిక్ ప్రైమరీ పాఠశాలలుగా డి గ్రేడ్ చేయటంపై విద్యాశాఖ ఉన్నతాధికారులు వివరాలు కోరారు. మండలంలోని అన్ని యూపీ పాఠశాలల్లో 6, 7,8 తరగతులను రద్దు చేయటంపై పూర్తిస్థాయి నివేదికను పంపాలని ఆదేశాలు జారీ చేశారు. 'విద్యార్థులకు కొత్త చిక్కులు' అనే శీర్షికన మండలంలోని 9 యూపీ పాఠశాలల ఎత్తివేతపై ఏర్పడనున్న ఇబ్బందులపై గత నెల 29న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అప్పట్లోనే స్పందించిన జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ ఎంఈవోను వివరణ కోరగా, ఆదివారం తాజాగా పాఠశాలల విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ నాగమణి మండలంలోని యూపీ పాఠశాలలన్నింటిని బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా మార్పు చేయటంపై వివరాలు కోరారు. ఆయా పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య, 6,7,8 తరగతగులు తీసేస్తే విద్యార్థులు ఎంత దూరంలో ఉన్న ఏ హైస్కూలుకు వెళ్లాలి, ఇందుకు గతంలో పాఠశాలల ఎస్‌ఎంసీలు అంగీకరించాయా? లేదా రద్దు కాబోతున్న యూపీ పాఠశాలల విద్యార్థులు హైస్కూళ్లకు వెళ్లేందుకు ఎదురయ్యే ఇబ్బందులపై రీజినల్ జాయింట్ డైరెక్టర్ నివేదిక కోరారు. ఇలా ఎందుకు చేశారని కూడా ఆర్జేడీ జిల్లా, మండల విద్యాశాఖ అధికారులను ఫోన్‌లో నిలదీసినట్లు తెలిసింది. నేరుగా ఫోన్‌లో మండల విద్యాధికారిని కూడా ప్రశ్నించినట్లు సమాచారం. దీంతో వెంటనే ఎంఈవో సేవ్యా మండలంలో ఉన్న యూపీ పాఠశాలలు, ఆ పాఠశాలలు బేసిక్ ప్రైమరీగా మారితే విద్యార్థులు 6, 7, 8 తరగతులకు ఏయే హైస్కూళ్లకు ఎంత దూరం వెళ్లాలి, యూపీ స్కూళ్ల రద్దుకు ఎస్‌ఎంసీలు అంగీకరించలేదన్న అంశాలతో ఆర్జేడీకి నివేదిక పంపారు.

ధ్యానంతో ఆలోచనలు తగ్గించొచ్చు

కైకలూరు, మే 12(ఆంధ్రజ్యోతి): శ్వాస మీద ధ్యాస పెడితే శ్వాసకు మనసుకు అవినావభావ సంబంధం ఏర్పడుతుందని సీనియర్ పిరమిడ్ మాస్టర్ మాజేటి శేషగిరిరావు, శ్యామల అన్నారు. సోమవారం కైకలూరులోని శ్రీ విశ్వాత్మ పిరమిడ్ ధ్యాన కేంద్రంలో బుద్ధపౌర్ణమి సామూహిక ధ్యానం, జ్ఞానబోధన కార్యక్రమాన్ని పిరమిడ్ ధ్యానం అధ్యక్షుడు కొండ్రెడ్డి వెంకట సత్యనారాయణ(పెదబాబు) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానబోధన కార్యక్రమంలో ప్రతి మనిషి రోజుకు 60వేల ఆలోచనలు చేస్తున్నట్లుగా రికార్డులున్నాయని నిత్యం ధ్యాన సాధనతో వాటిని తగ్గించుకోవచ్చని సూచించారు. ప్రతి మనిషి ఆలోచనలు రకరకాలుగా వెళ్లిపోతాయని వాటన్నింటిని అదుపులో పెట్టుకునేందుకు నిత్యం ధ్యాన సాధనతోనే సాధ్యపడుతుందన్నారు. ధ్యానం కూడా దైవంతో సమానమని ప్రతి ఒక్కరూ దీనిని ఆచరిస్తే వారిలో అనేక రుగ్మతలు సైతం దూరమవుతాయన్నారు. ఈ ధ్యాన సాధనతో ఆలోచనరహిత స్థితిలో కలిగే అనేక శారీరక నాడీమండల ఆత్మ అనుభవాలను గమనిస్తూ ఉండాలన్నారు. ధ్యానం చేస్తుంటే శరీరం వెలుపల ఉండే విశ్వమాయ ప్రాణశక్తి అపారంగా శరీరంలోకి ప్రవేశించి నాడీమండలాన్ని శుద్ధి చేస్తుందన్నారు. ఎవరి వయస్సును బట్టి వారు అన్ని నిమిషాలు రోజుకు రెండుసార్లు తప్పనిసరిగా ధ్యానం చేయాలని సూచించారు. ప్రతి రోజూ నియమబద్ధంగా ధ్యాన అభ్యాసాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ అధ్యక్షురాలు కొండ్రెడ్డి చిట్టెమ్మ, శ్రీనివాసు, సత్యనారాయణ, రాజేశ్వరరావు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



జ్ఞాన బోధన చేస్తున్న శ్యామల, శేషగిరిరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

ముసునూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో బీపీ సత్యనారయణ ఆదేశించారు. సోమవారం పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజాప్రతినిధులు సమన్వయంతో అభివృద్ధి పనులను చేపట్టి త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన వివిధ రకాల సర్వేలు నత్తనడకన సాగుతున్నాయని, వాటిని సకాలంలో పూర్తిచేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ సగ్గుర్తి శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నూతన గ్రామ కమిటీ పత్రాన్ని చూపుతున్న గోపవరం నాయకులు

టీడీపీ గ్రామ అధ్యక్షుల ఎంపిక

ముసునూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం గ్రామ అధ్యక్ష ఎంపికను సోమవారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు దేవినేని ధలరాం, పరిశీలకుడు నక్కనబోయిన వేణు అధ్వర్యంలో ఈ ప్రక్రియ జరిగింది. నూతన అధ్యక్షుడిగా యువనేత ఉప్పలపాటి గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు దేవినేని తెలిపారు. రమణక్కపేట టీడీపీ గ్రామ నూతన అధ్యక్షుడిగా మాజీ అధ్యక్షుడు రంగు అంజనేయులు కుమారుడు యువ నాయకుడు రంగు శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎంపికైనట్లు దేవినేని చెప్పారు. చెక్కపల్లి, లోపూడి గ్రామాల అధ్యక్షల ఎంపిక అధిష్ఠానం వద్ద ఉందని, రెండు, మూడు రోజుల్లో ప్రక్రియ పూర్తి అవుతుందని తెలిపారు. గతంలో ఎన్నడులేని విధంగా గ్రామ అధ్యక్ష పదవి కోసం తెలుగు తమ్ముళ్ళు పోటీ పడుతున్నారు. 10 నుంచి 30 ఏళ్ళు పార్టీ అధ్యక్షులుగా ఉన్న వారు సైతం ఈ సారి యువ నాయకులకు గ్రామ అధ్యక్షులుగా అవకాశం ఇస్తుడంటం విశేషం.

మంత్రి లోకేశ్ దృష్టికి సమస్యలు



ముదినేపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ కలిశారు. సోమవారం ఉండవల్లిలో ఆయన నివాస గృహంలో కలసి కైకలూరు నియోజకవర్గంలోని పలు సమస్యల పరిష్కారంపై తీసుకోవాల్సిన చర్యలు, నిధుల మంజూరుపై లోకేశ్‌తో చర్చించారు. ముఖ్యంగా పామర్రు - దిగమర్రు జాతీయ రహదారి విస్తరణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా జాతీయ రహదార్ల అభివృద్ధి సంస్థ అధికారులతో మాట్లాడాలని కోరారు. ముదినేపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు అవసరాన్ని వివరించారు. నియోజకవర్గంలో టీడీపీ గ్రామస్థాయి కమిటీల నిర్మాణంపై చర్చించిన సందర్భంగా పార్టీ కోసం అంకిత భావంతో పని చేసిన కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వాలని, త్వరలో గ్రామ కమిటీల నిర్మాణం పూర్తి చేయాలని మంత్రి లోకేశ్ సూచించారని వినోద్ తెలిపారు.

విద్యార్థులకు వ్యాకరణం, పుస్తక పఠనం



కలిదిండి మే 12 (ఆంధ్రజ్యోతి): కలిదిండి, కోరుకొల్లు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతున్నాయి. సోమవారం విద్యార్థులకు పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, వ్యాకరణం నేర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు మాట్లాడుతూ పుస్తక పఠనంలో విద్యావికాసం, క్రమశిక్షణ పెంపొందుతాయన్నారు. విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. కోరుకొల్లు గ్రంథాలయాధికారి రాఘవులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీతి కథల పఠనం

ముదినేపల్లి, మే 12 (ఆంధ్ర జ్యోతి): వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా సోమవారం ముదినే పల్లి, గురజ శాఖా గ్రంథాలయాల్లో గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి ఆధ్వర్యం లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. చెస్, మ్యూజికల్ చైర్స్ పోటీలను నిర్వహించిన అనంతరం విద్యార్థులకు కథలు బోధించారు. నీతి కథలు, పద్యాలను చదివించారు. గ్రంథాలయాల ఆవశ్యకతను ఆమె వివరించారు.

టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న బూరుబోయిన శ్రీనివాసరావు

కైకలూరు, మే 12(ఆంధ్రజ్యోతి): మెగా టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను కైకలూరు మండలం ఆచవరంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరుబోయిన శ్రీనివాసరావు ప్రారంభించారు. సోమవారం బీఎస్సార్, ఎన్‌వై ఆధ్వర్యంలో మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలిచిన జట్టుకు మొదటి బహుమతి రూ.25వేలు, రెండవ బహుమతి రూ.20వేలు, మూడవ బహుమతి రూ.15వేలు అందించనున్నారు. 40టీమ్‌లు పాల్గొంటుండగా 10రోజుల పాటు ఈ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ముగ్గురు ఎక్సైజ్ నిందితుల అరెస్ట్



చాట్రాయి, మే 12(ఆంధ్రజ్యోతి): గతంలో ఎక్సైజ్ నేరాలకు పాల్పడి నేర స్థలం నుంచి పారిపోయిన పోతనపల్లి చిన్న తండాకు చెందిన ధరావతు చంటి, పెద్ద తండాకు చెందిన ధారవతు దేవి, చిన్నంపేటకు చెందిన పరసా నాగేశ్వరరావులను సోమవారం అరెస్ట్ చేసి తిరువూరు కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు.

అంబేడ్కర్ సేవా ట్రస్ట్ కరపత్రం ఆవిష్కరణ

ముసునూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ సేవా ట్రస్ట్ కరపత్రాన్ని ముసునూరు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కె.వి రమణ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ సేవా ట్రస్ట్ చైర్మన్ వరకిషోర్ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పల్లి రవికుమార్, కొలకలూరి మోమన్‌రావు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సహకారం...
వసతుల సాకారం

ప్రభుత్వ పాఠశాలలకు సమకూరుతున్న వసతులు



ముసునూరు జడ్పీపాఠశాల అవరణలో నిర్మించిన భోజనశాల

ముసునూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేసే ప్రభుత్వ పాఠశాలల్లో దాతల సహకారంతో అనేక వసతులు సమకూరుతున్నాయి. ముసునూరు మండలం వేల్పుచర్ల జడ్పీ ఉన్నత పాఠశాలకు ఇదే పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కామవరపు నారాయణరావు తన తల్లిదండ్రులు వీరాస్వామి, వెంకట సుబ్బమ్మ జ్ఞాపకార్థంగా ఇటీవల రూ.2లక్షలతో పాఠశాలలో కళావేదికను ఏర్పాటు చేయించారు. ఇదే గ్రామానికి చెందిన దాతలు మానం వంశీ పాఠశాల అభివృద్ధికి రూ.50వేలు అందించారు. మానం రాంబాబు 43సెంట్లు స్థలాన్ని పాఠశాలకు విరాళంగా ఇచ్చారు. రూ.30వేలు విలుగల కంప్యూటర్లను ఇటీవల పూర్వ విద్యార్థులు అందజేశారు.

● ముసునూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు దాతలు చేయూతను అందిస్తుండటంతో సౌకర్యాలు సమకూరుతున్నాయి. భోజనాల లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో దాత గుళ్ళపల్లి రుక్మాబాయ్ రూ.12లక్షలతో భోజనశాల, వంటషెడ్, బాస్కెట్‌బాల్ కోర్టును సైతం ఇటీవల నిర్మించారు. ప్రముఖ హోమియోపతి వైద్యులు దేవినేని బాబు రాజేంద్రప్రసాద్ రూ.2లక్షలతో కళావేదిక నిర్మాణం చేశారు. ప్రతి ఏటా విద్యార్థులకు నోట్‌బుక్స్, ఇతర సామగ్రి అందిస్తున్నారు. పూర్వవిద్యార్థులు దేవినేని వరప్రసాదరావు, చలసాని కుటుంబరావు, దేవినేని వీరబద్రం తదితరులు సహకారంతో పాఠశాల చుట్టూ సుమారు కిలోమీటరు పొడవుగా లక్షలాది రూపాయలతో ప్రహరీ నిర్మాణం చేయగా, మరికొంతమంది పూర్వవిద్యార్థులు విద్యాభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తున్నారు.

● గుడిపాడు జడ్పీ పాఠశాలకు రాయంకుల రామారావు ఐదు ఎకరాల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. పాఠశాలలో చదువుతున్న పక్క గ్రామాల విద్యార్థులకు రూ.3.60లక్షలతో సుమారు 50సైకిళ్ళను కొనుగోలు చేసి అందించారు. పదవ తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఏటా ప్రోత్సాహక నగదు బహుమతులు అందిజేస్తున్నారు.



వేల్పుచర్ల జడ్పీపాఠశాల అవరణలో నిర్మించిన కళావేదిక

పౌర రక్షణ వలంటీర్లుగా చేరండి

ఏలూరు క్రైం, మే 12 (ఆంధ్రజ్యోతి): యువత పౌరరక్షణ వలంటీర్లుగా పేరు నమోదు చేసుకోవాలని నెహ్రూ యువకేంద్ర జిల్లా యువజన అధికారి సుంకర రాము కోరారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. యువతను 'మై భారత్ సివిల్ డిఫెన్స్ వలంటీర్లు'గా నమోదు చేసుకోవడానికి భారత ప్రభు త్వ యువజన వ్యవహారాల, క్రీడల మంత్రిత్వశాఖ చర్యలు చేపట్టిందన్నారు. వలంటీర్లు అత్యవసర పరిస్థితులు, సంక్షోభ సమయాల్లో జాతీయ ప్రయోజనం లో కీలకపాత్ర పోషించడానికి యువతను శక్తిమంతం చేయడానికి సమష్టి ప్రయత్నం చేపట్టిందన్నారు. ప్రజా అత్యవసర పరిస్థితులు, ఇతర ఊహించని పరిస్థితులు, పౌర పరిపాలనపై ప్రతిస్పందించే, స్వచ్ఛంద దళాన్ని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ చాలా సులభమని అధికారిక మై భారత్ పోర్టల్‌లో ఆసక్తి గల యువత పేరు నమోదు చేయించుకోవచ్చునన్నారు. మరిన్ని వివరాలను జిల్లా యువజన అధికారి సుంకర రాము సెల్ నెంబర్ 9966357021, మైభారత్ రాష్ట్ర డైరెక్టర్ అన్సుమన్ ప్రసాద్ దాస్ సెల్ నెంబర్ 9437505290 లేదా నెహ్రూ కేంద్ర ఏలూరు కార్యాలయ ఫోన్ నెంబర్ 08812- 230860ను సంప్రదించాలని సూచించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475